


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో


## మెరిసిన భారత్

- పురుషుల ఈవెంట్లో స్వర్ణం
- మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో రజతం




13

# సూపర్ సిక్స్'ర్!



- 15 నెలల పాలనలో లక్ష కోట్లు దాటిన సంక్షేమం
- అభివృద్ధి దిశగానూ కూటమి సర్కారు పరుగులు
- సూపర్ సిక్స్ హిట్‌పై అనంతపురంలో ఎన్డీయే సభ
- 10న అనంతలో సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభ
- 15 నెలల పాలనా విజయాలను ప్రజల్లోపెట్టే ఉత్సాహం
- సవాళ్లున్నా సంక్షేమం.. అడ్డంకులను అధిగమించి అభివృద్ధి
- మేనిఫెస్టో అమలులో డిస్టింక్షన్ సాధించిన చంద్రబాబు సర్కారు
- సుపరిపాలనతో ఏపీకి సరికొత్త బ్రాండ్ ఇమేజ్
- రూ.పది లక్షల కోట్లమేర పెట్టుబడుల ఒప్పందాలు
- అన్ని వర్గాలకు బాసటగా కూటమి సంతృప్తికర పాలన

2

రాష్ట్ర ప్రజలు ఏం ఆశించి చంద్రబాబు సారథ్యంలోని కూటమిని గెలిపించుకున్నారో.. అంతకుమించి సంతృప్తికర పాలన రాష్ట్రంలో సాగుతోంది. సాధారణ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు ఏమిస్తానని హామీ ఇచ్చారో.. ఆరంభంలోనే హామీలన్నీ అమలు చేసి మాట నిలబెట్టుకున్నారు. పదిహేను నెలల కాలంలోనే ప్రజా విశ్వాసాన్ని చూరగొంది రాష్ట్ర ప్రభుత్వం. ఏపీ మనుగడకే ముప్పు ఎదురైన విధ్వంస పరిస్థితులనుంచి -వికాశం దిశగా అడుగులేస్తోన్న కూటమి ప్రభత్వం.. ఇప్పుడు తన సైద్ధాంతిక నిబద్ధతను, సాధించిన విజయాలను ప్రజలముందు పెట్టేందుకు సన్నద్ధమైంది. అందులో భాగంగానే -సీమ గడ్డపైన అనంత వేదికగా 'సూపర్ సిక్స్ -సూపర్ హిట్' బహిరంగ సభను సెప్టెంబరు 10న నిర్వహించేందుకు సన్నాహాల్లో తలమునకలైంది. పదిహేను నెలల కాలంలో రూ.లక్ష కోట్లు దాటిన సంక్షేమాన్ని.. పదిహేను నెలల పాలనలో రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్న ఘనతను సగర్వంగా ప్రకటించుకోవడానికి, రాష్ట్రాభివృద్ధిపట్ల తన చిత్తశుద్ధి, నిబద్ధతను చాటుకోవడానికి -ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఉత్సాహం చూపిస్తోంది! పాలన అంటే ఇదీ అంటోన్న రాష్ట్ర ప్రజల ప్రశంసలను సంబరాలు చేయడానికి బహిరంగ సభను నిర్వహిస్తోంది.



## పరిశ్రమలకు ఏపీ గమ్యస్థానం

# పెట్టుబడులతో రండి

- సీఎం చంద్రబాబు నేతృత్వంలో లాజిస్టిక్ హబ్‌గా ఏపీ
- స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు
- పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులు
- కోయంబత్తూరు పారిశ్రామికవేత్తలతో భేటీలో మంత్రి లోకేష్

3



# ఏపీలోనూ సంవిత్ పాఠశాల

- శ్రీఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం పీఠాధిపతికి మంత్రి లోకేష్ వినతి
- అంగీకరించిన జగద్గురు శ్రీ నిర్మలానందనాథ మహాస్వామి
- కర్ణాటకలోని శ్రీఆదిచుంచనగిరి క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి
- పీఠాధిపతి నిర్మలానందనాథ మహాస్వామి ఆశీస్సులు పొందిన లోకేష్
- మఠం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు తెలుసుకున్న వైనం
- సంవిత్ పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్ వరకు అన్ని వసతులతో పేద విద్యార్థులకు ఉచిత విద్య
- తరువాత ఏ రాష్ట్రంలో డిగ్రీ చదివినా మఠం ఆర్థిక సాయం

4

## చరిత్రలో నిలిచేలా..

- అనంతపురం సభపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- ఏర్పాట్ల పరిశీలన

5




## పకడ్బందీగా ఏర్పాట్లు

- నాయకులు సమన్వయంతో కృషి చేయాలి
- మంత్రుల బృందం విస్తృత సమీక్ష

5



## ఉల్లి మద్దతు ధరపై దుష్ప్రచారం

- క్వింటాల్‌కు రూ.1200 చెల్లిస్తున్నాం
- రైతులు తక్కువకు అమ్ముకుంటే ధరలో వ్యత్యాసం వారి ఖాతాల్లో జమ
- కర్నూల్ మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ప్రభుత్వం స్పష్టీకరణ

6

## ఆసియా హాకీ కప్ విజేత భారత్



ఆసియా హాకీ కప్ విజేతగా భారత్ నిలిచింది. బీహార్‌లోని రాజగర్ వేదికగా ఆదివారం రాత్రి దక్షిణ కొరియాతో హొరాహొరీగా సాగిన పోరులో భారత హాకీ జట్టు విజయదుందుభి మోగించింది. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణ కొరియాపై 4-1 తేడాతో గెలుపొంది.. హాకీ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించింది. భారత్ జట్టు హాకీ ఆసియాకప్ గెలవడం ఇది నాలుగోసారి. ఇంతకు ముందు 2003, 2007, 2017లో విజేతగా నిలిచింది. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

## అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం

- ప్రజలే ఛీకొడతారు
- మంత్రి నారాయణ మండిపాటు
- వచ్చే ఫిబ్రవరికి గెజిటెడ్ అధికారుల ఇళ్లు పూర్తిచేసి అప్పగిస్తాం
- ఐఏఎస్ అధికారుల టవర్లు దాదాపు పూర్తి

6

# సూపర్ సిక్స్'ర్!

- 15 నెలల పాలనలో లక్ష కోట్లు దాటిన సంక్షేమం
- అభివృద్ధి దిశగానూ కూటమి సర్కారు పరుగులు
- సూపర్ సిక్స్ హిట్‌పై అనంతపురంలో ఎన్డీయే సభ
- 10న అనంతలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభ
- 15 నెలల పాలనా విజయాలను ప్రజల్లోపెట్టే ఉత్సాహం
- సవాళ్లున్నా సంక్షేమం.. అడ్డంకులను అధిగమించి అభివృద్ధి
- మేనిఫెస్టో అమలులో డిస్టింక్షన్ సాధించిన చంద్రబాబు సర్కారు
- సుపరిపాలనతో ఏపీకి సరికొత్త బ్రాండ్ ఇమేజ్
- రూ.పది లక్షల కోట్లమేర పెట్టుబడుల ఒప్పందాలు
- అన్ని వర్గాలకు బాసటగా కూటమి సంతృప్తికర పాలన



అమరావతి (చైతన్య రథం): సూపర్ సిక్స్ విజయంపై రాష్ట్రంలో కూటమి పార్టీలు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి ఉమ్మడి సభ నిర్వహిస్తోంది. డబుల్ ఇంజన్ సర్కార్ 15 నెలల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా అనంతపురంలోని ఇంద్రప్రస్థనగర్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి తొలి ఉమ్మడి సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ అగ్రనేతలు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు హాజరుకానున్నారు. ఈనెల 10న మధ్యాహ్నం 3 గంటలకు జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది ప్రజలు హాజరయ్యేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ పార్టీలు నిర్వహించే తొలి సభ కావటంతో దీన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఏడాది కాలంలోనే అత్యంత కీలకమైన నిర్ణయాలతోపాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తి చేసి ప్రజలకు సంక్షేమం అందించటంపై సభలో ప్రధానంగా ప్రస్తావించనున్నారు. మొత్తంగా 15 నెలల పాలనా విజయాలను ఆవిష్కరించేలా సభను నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పార్టీలవారీగా టీడీపీ, జనసేన, బీజేపీ వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేసుకున్నాయి. 2024 ఎన్నికలముందు కూటమిగా ఏర్పడిన మూడు పార్టీలు ప్రజల ముందుకు కలిసి వెళ్లాయి. 94శాతం స్ట్రైక్ రేట్‌తో సాధారణ ఎన్నికల్లో విజయం సాధించాయి. 164 సీట్లతో కనీవినీ ఎరగని విజయాన్ని దక్కించుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలనాపగ్గాలు చేపట్టిన అనంతరం సంయుక్త నిర్ణయాలతోనే ప్రజాపాలన సాగిస్తున్నాయి. ఉమ్మడిగా అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలతో లక్షకోట్లకు పైగా సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరింది. అలాగే ప్రభుత్వంగా ఇప్పటి వరకూ అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి బహిరంగ సభ ద్వారా ప్రజలకు చెప్పాలని కూటమి అగ్రనాయకత్వం భావిస్తోంది.

### సవాళ్లున్నా సంక్షేమం అభివృద్ధివైపే అడుగులు

గత పాలకులు చేసిన విధ్వంసంతో ఆంధ్రప్రదేశ్ అప్పులకుప్పగా మారింది. వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. అవినీతి అక్రమాలతో రాబడి కుంటుపడింది. పరిశ్రమలూ పొరుగు రాష్ట్రాలకు పారిపోయాయి. ఏపీ రోడ్ల గురించి పొరుగు రాష్ట్రాల్లోనూ హేళనగా మాట్లాడిన దుస్థితి. అనేక ఆర్థిక సవాళ్లున్నా ఊహించని స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. 15 నెలల క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా నిర్ణయాలు అమలు చేసింది. సంక్షేమం ఒకవైపు, అభివృద్ధి ఇంకోవైపు అంటూ పాలనను పరుగులు పెట్టించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే పాలనా పగ్గాలు చేపడుతూనే పెంచిన పెన్షన్లను అమలు చేసేలా తొలిసంతకం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు. హామీ ఇచ్చిన నాటినుంచే పెంచిన పెన్షన్లు అమలయ్యేలా మూడు నెలల బకాయిలు కలిపి వృద్ధులు, దివ్యాంగులు, ఇలా వివిధ కేటగిరీలకు చెందిన పెన్షనర్లకు అందించింది కూటమి సర్కారు. ప్రతీ నెలా జరిగే సామాజిక పండుగగా పెన్షన్ల పథకం అమలు చేస్తోంది. ఇప్పటి వరకూ దాదాపు రూ.45 వేల కోట్లను వెచ్చించింది. మహిళలకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇచ్చేలా దీపం 2.0 పథకాన్నీ దిగ్విజయంగా అమలు చేస్తోంది. 2.3 కోట్ల ఉచిత గ్యాస్ సిలెండర్లు మహిళల ఇళ్లల్లో వెలుగులు నింపాయి. తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలున్నా వారందరికీ ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలిచింది. 67 లక్షలమంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.13 వేల చొప్పున నిధుల్ని జమ చేసింది. దీని కోసం రూ.10 వేల కోట్లను కూటమి వెచ్చించింది. గతంలో ఒక్కరికి మాత్రమే ఈ సాయం అందేది. కానీ కూటమి ప్రభుత్వం ఎంతమంది పిల్లలున్నా వర్తింప చేస్తోంది. అన్నదాతకు ఆత్మబంధువుగా నిలుస్తూ 44 లక్షలమంది రైతులకు రూ.20 వేల చొప్పున మూడు విడతలుగా ఆర్థిక సాయం అందించేలా అన్నదాత సుఖీభవ పథకాన్నీ అమలు చేస్తోంది. గత పాలకులు ఏడాదికి రూ.7,500 విదిలిస్తే.. కూటమి సర్కారు ఒక్క విడతకే రూ.7 వేలను వారి ఖాతాల్లో వేసింది. దీనికోసం రూ.3,200 కోట్లను వెచ్చించింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ స్త్రీశక్తి పథకం అమలు చేస్తోంది కూటమి. 5 కోట్ల పైచిలుకు ప్రయాణాలతో మహిళలు ఈ పథకాన్ని సూపర్‌హిట్ చేశారు. దీనికోసం రూ.2 వేల కోట్లను వెచ్చిస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీనీ నిలబెట్టుకుంది ప్రభుత్వం. అలాగే పెట్టుబడులను ఆకర్షించడం... పరిశ్రమలు స్థాపించడం ద్వారా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. సుపరిపాలనతో రాష్ట్ర బ్రాండ్ ఇమేజీని పునరుద్ధరించి.. 15 నెలల కాలంలో దాదాపు రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలను కుదుర్చుకుంది ప్రభుత్వం. వీటిద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

### అందరికీ ఆరోగ్య సేవ

పేదవాడికి ఆకలి తీర్చేలా రాష్ట్రంలో 204 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం రూ.5కే భోజనం అందిస్తోంది. ఇప్పటి వరకూ 5.6 కోట్ల భోజనాలు అన్నార్తుల కడుపు నింపాయి. ఇక రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య ధీమా కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకం. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనట్టుగా పేద ధనికా అనే తారతమ్యం లేకుండా 5 కోట్లమంది ప్రజలకు వర్తింప చేస్తూ యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుకు కూటమి నిర్ణయించింది. రూ.25 లక్షలవరకూ వైద్య చికిత్సలు ఉచితంగా చేయించుకునేందుకు ఆస్కారం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. సంక్షేమాన్ని-అభివృద్ధిని కలగలిపి పాలన చేస్తూ ఇప్పటికే సంక్షేమంపై రూ. లక్షకోట్లకు పైగా వెచ్చించింది కూటమి సర్కారు. గత పాలకులు ఐదేళ్ల కాలంలో 2 లక్షల కోట్ల రూపాయలు వెచ్చించామని గొప్పలు చెప్పుకుంటుంటే.. కేవలం 15 నెలల కాలంలోనే రూ. లక్ష కోట్లకు పైగా వ్యయం చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఏడాదిలోనే ఇరిగేషన్ రంగంలో అద్భుతమైన ఫలితాలు సాధించింది ప్రభుత్వం. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా రాయలసీమ చివరి భూములకు తొలిసారి సాగునీరు అందించింది ప్రభుత్వం.

### అన్ని వర్గాలకు అండగా...

బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందుకు తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోంది. చేతి వృత్తులు, కులవృత్తులైన అన్ని వర్గాలకు బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అండగా నిలుస్తోంది. బీసీల రక్షణ చట్టం తెచ్చేందుకు మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌లను గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గిస్తే... తిరిగి 34 శాతానికి పెంచేలా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బీసీల గృహ నిర్మాణానికి అదనంగా రూ.50 వేలు, బీసీల ఇళ్లపై 3 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రూ.98,000 సబ్సిడీ ఇస్తోంది. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు ప్రభుత్వం పెంచింది. అలాగే ఈ వర్గాలకు దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో చోటు కల్పించేలా నిర్ణయం తీసుకుంది. 40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తోంది. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు కల్లు గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించింది. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించింది. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. చేనేత ఉత్పత్తులకు జీఎస్టీ 5 శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నేతన్న భరోసా కింద చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25 వేలు సాయంగా ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 10 శాతం కేటాయింపు, కురబలకు, యాదవులకు సబ్సిడీలో గొర్రెలు, మేకలు, పశువులు అందించి ఉపాధి కల్పిస్తోంది. ఎస్సీ సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా... ఏవర్గాన్నీ నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. ఏజెన్సీ ప్రాంతాల్లో 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టింది. మైనారిటీల హక్కులు పరిరక్షిస్తూ, అవసరాలు తీరుస్తోంది. ఇమామ్‌లకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తోంది. హజ్ యాత్రికులకు ఒకొక్కరికి రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తోంది. గన్నవరం ఎయిర్‌పోర్టును ఎంబార్కేషన్ పాయింట్‌గా చేసింది. 8,427 మంది పాస్టర్లకు రూ.5,000 గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఇస్తోంది. ఇక అర్చకుల జీతాలను రూ.15 వేలు చేసిన ప్రభుత్వం... ధూప దీప నైవేద్యాలకు ఆలయానికి రూ.10 వేల చొప్పున చెల్లిస్తోంది. ఇక వేద విద్యార్థులకు రూ.3 వేల స్టయిఫండ్ కూటమి ప్రభుత్వం అందిస్తోంది.

### టీమ్ ఎన్డీఏగా సక్సెస్...

చిన్నపాటి పొరపొచ్చాలు లేకుండా కూటమి సర్కారు పాలన కొనసాగిస్తోంది. ఎన్నికలకు ముందు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా... సీట్ల సర్దుబాటు చేసుకున్న మూడు పార్టీలు... అధికారంలోకి వచ్చాక కూడా అదే పంథాతో వెళ్తున్నాయి. కలిసికట్టుగా నడుస్తున్నాయి. 15 నెలల కాలంలో సీఎం చంద్రబాబు- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ -మంత్రి లోకేష్ -బీజేపీ అగ్ర నేతలు అత్యంత సమన్వయంతో పని చేస్తున్నారు. అవసరమైన సమయాల్లో కేంద్రంతో, ప్రధాని మోదీతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తున్నారు. ఇక నామినేటెడ్ పదవుల విషయంలోనూ మూడు పార్టీల మధ్యే అంతే సమన్వయం, సహకారం కన్పిస్తోంది. ప్రాంతాలు, జిల్లాలవారీగా... ఆయా సామాజిక వర్గాల సమీకరణాలను బేరీజు వేసుకుని నామినేటెడ్ పదవుల కూర్పు చేపడుతున్నారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఇప్పటి వరకు సుమారు 60 వేల నామినేటెడ్ పదవుల భర్తీ సాఫీగా జరిగింది. కలిసి వచ్చాం, కలిసి గెలిచాం, కలిసి పని చేస్తున్నాం.. ఇక భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం అనే రీతిలో ఓ బలమైన సంకేతాన్ని ఈ వేదిక ద్వారా పంపాలన్నది కూటమి నేతల లక్ష్యంగా కన్పిస్తోంది.

## పరిశ్రమలకు ఏపీ గమ్యస్థానం

# పెట్టుబడులతో రండి

- సీఎం చంద్రబాబు నేతృత్వంలో లాజిస్టిక్ హబ్‌గా ఏపీ
- స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు
- పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులు
- కోయంబత్తూరు పారిశ్రామికవేత్తలతో భేటీలో మంత్రి లోకేష్
- విమానాశ్రయంలో తెలుగుప్రజల ఘనస్వాగతం




కోయంబత్తూరు (చైతన్యరథం): పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోయంబత్తూరులోని పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. పారిశ్రామిక వేత్తలతో సమావేశానికి తమిళనాడులోని కోయంబత్తూరుకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు ఆదివారం ఎయిర్ పోర్టులో తమిళనాడు బీజేపీ నేత అమర్ ప్రసాద్ రెడ్డి, అక్కడి తెలుగు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోయంబత్తూరులోని పారిశ్రామికవేత్తలతో జరిపిన సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు పూర్తి అనుకూల వాతావరణం నెలకొని ఉందిదన్నారు. పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేస్తున్నాం. పరిశ్రమదారులు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టుతో రాష్ట్రానికి వచ్చాక నిర్మాణం పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత మాదే. రాష్ట్రంలో పెద్దఎత్తున వాయు, జల, రోడ్డు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రపదేశ్ లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న పరిశ్రమ అనుకూల విధానాల వల్ల పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. పరిశ్రమలకు గమ్యస్థానంగా మారిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.















చైతన్యరథం

# ఏపీలోనూ సంవిత్ పాఠశాల



- శ్రీఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం పీఠాధిపతికి మంత్రి లోకేష్ వినతి
- అంగీకరించిన జగద్గురు శ్రీ నిర్మలానందనాథ మహాస్వామి
- కర్ణాటకలోని శ్రీఆదిచుంచనగిరి క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి
- పీఠాధిపతి నిర్మలానందనాథ మహాస్వామి ఆశీస్సులు పొందిన లోకేష్
- మఠం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు తెలుసుకున్న వైనం
- సంవిత్ పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్ వరకు అన్ని వసతులతో పేద విద్యార్థులకు ఉచిత విద్య
- తరువాత ఏ రాష్ట్రంలో డిగ్రీ చదివినా మఠం ఆర్థిక సాయం



కర్ణాటక (చైతన్యరథం): కర్ణాటక రాష్ట్రం మాండ్య జిల్లా నాగమంగల తాలూకాలోని ప్రముఖ సామాజిక-ఆధ్యాత్మిక కేంద్రం శ్రీఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం సందర్శించారు. శ్రీ ఆదిచుంచునగిరి మహాసంస్థానం ఒక ఆధ్యాత్మిక దివ్యధామం. శతాబ్దాల చరిత్ర, అసంఖ్యాకమైన భక్తుల నమ్మకం, అణువణువునా నిండిన భక్తిభావం, అపారమైన మానవసేవ.. ఇవన్నీ కలిసి ఆ క్షేత్రాన్ని ఒక శక్తి కేంద్రంగా మార్చేశాయి. 18 వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మఠం జ్ఞానానికి, భక్తికి, సేవకు పర్యాయపదంగా నిలిచింది. తొలుత క్షేత్రంలోని శ్రీ కాలభైరవేశ్వర స్వామివారిని దర్శించుకుని మంత్రి నారా లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం చేపడుతున్న వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మఠం 72వ పీఠాధిపతి జగద్గురు శ్రీ నిర్మలానందనాథ మహాస్వామిజీ ఆశీర్వాదం పొందారు. మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, మెడికల్ కాలేజ్, హాస్పిటల్, యూనివర్సిటీను మంత్రి నారా లోకేష్ సందర్శించారు. అనంతరం మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంవిత్ పాఠశాలల గురించి ప్రత్యేకంగా అడిగితెలుసుకున్నారు. ఈ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఎటువంటి ఖర్చు లేకుండా 6వ తరగతి నుండి ఇంటర్ వరకూ అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నాం అని మఠం నిర్వాహకులు తెలిపారు. అంతే కాకుండా ఇంటర్ పూర్తయిన తరువాత ఏ రాష్ట్రంలో డిగ్రీ చదవాలి అనుకున్నా మఠం ఆర్థిక సహాయం అందిస్తుంది అని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సంవిత్ పాఠశాల ప్రారంభించాలని మంత్రి నారా లోకేష్ కోరగా పీఠాధిపతి జగద్గురు శ్రీ నిర్మలానందనాథ మహాస్వామిజీ అందుకు అంగీకరించారు. దీంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపే ఒక గొప్ప సంకల్పం ఆవిష్కృతమైంది.



















# చరిత్రలో నిలిచేలా..

- అనంతపురం సభపై
టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుపల్లా ఉద్ఘాటన
- ఏర్పాట్లు పరిశీలించిన పల్లా



అనంతపురం (చైతన్యరథం): అనంతపురంలో ఈ నెల 10న నిర్వహించనున్న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. అనంతపురంలోని జిఎంఆర్ గ్రౌండ్స్‌లో జరగనున్న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ ఏర్పాట్లను ఆయన ఆదివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నేతలంతా హాజరుకానున్నారు. సుమారు మూడున్నర లక్షల మంది ప్రజలు తరలిరావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, పార్కింగ్, తాగునీటి సదుపాయం, విద్యుత్, మొబైల్ టాయిలెట్లు వంటి సౌకర్యాలపై పల్లా ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి చిన్న అంశాన్నీ జాగ్రత్తగా సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులు, నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కడపలో జరిగిన మహానాడు సభను మించే రీతిలో అనంతపురంలో ఈ సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చాం. తల్లికి వందనం పథకం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సహా రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సూపర్ సిక్స్ హామీలు ప్రతి ఇంట్లో సంతోషాన్ని నింపుతున్నాయి. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కూటమిగా మేము నిలిచాం. ఈ సభను విజయవంతం చేయడానికి కూటమి నాయకులంతా ఒకే తాటిపై పనిచేస్తున్నారు.ప్రజలు స్వచ్ఛందంగా ఈ సభకు తరలివచ్చి మమ్మల్ని ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందని పల్లా విశ్వాసం వ్యక్తం చేశారు.

ఏర్పాట్ల పరిశీలనలో పల్లా వెంట ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, కాలువ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు

- నాయకులు సమన్వయంతో కృషి చేయాలి
- అనంతపురంలో మంత్రుల బృందం విస్తృత సమీక్ష



అనంతపురం (చైతన్యరథం): అనంతపురంలో ఈ నెల 10న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు అన్ని స్థాయిల నాయకులు సమన్వయంతో కృషి చేయాలని మంత్రులు పిలుపు ఇచ్చారు. సభ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు, కూటమి నాయకులు, స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఆదివారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ బహిరంగ సభను విజయవంతం చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్య నాయకులకు సూచించారు. సభ నిర్వహణకు సంబంధించిన పనులపై ప్రత్యేక దృష్టిని సారించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విజయోత్సవ సభకు జన సమీకరణ, వసతుల ఏర్పాట్లు, సభావేదిక పనులు, పోలీసు భద్రతా చర్యలు, పార్కింగ్ స్థలాల కేటాయింపు, సీటింగ్ సౌకర్యాలు, నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపు, హెలిప్యాడ్ పనులు, భోజన వసతి ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, మీడియా సమన్వయ సహకారాలు, బారికేడ్ల ఏర్పాటు, తదితర అంశాలపై చర్చించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక బద్ధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. అనంతరం సభ నిర్వహణ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్ల పనులకు సంబంధించి పలు విషయాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమా, సీఎం పర్యటనల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, రాయదుర్గం, అనంతపురం, సింగనమల, మడకశిర, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, రాష్ట్ర కార్మికసంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అహుడా చైర్మన్ వరుణ్, కూటమి నాయకులు, తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# హలో..అమ్మా..నాన్నా బాగున్నారా?

- ఎంజేపీ స్కూళ్లలో పే ఫోన్ల ఏర్పాటు
- 110 గురుకులాల్లో 6 చొప్పున ప్రారంభం
- కార్పొరేట్ తరహాలో టెలిఫోన్ బాక్సులు
- రోజుకు 2 గంటలు తల్లిదండ్రులతో విద్యార్థులకు మాట్లాడుకునే అవకాశం
- ఇక పిల్లలకు తీరనున్న ఇంటి బెంగ
- నేడు ప్రారంభించనున్న మంత్రి సవిత



అమరావతి(చైతన్యరథం): కళ్లెదుట ఉండాల్సిన పిల్లలు ఎక్కడో దూరంగా గురుకులంలో ఉంటూ తింటున్నారో..లేదో? ఎలా ఉం టున్నారో? అన్న బెంగతో మదనపడే తల్లిదండ్రులకు రోజూ తమ బిడ్డ పలుకరింపు వినే సదావకాశం కూటమి ప్రభుత్వం కల్పించిం ది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సౌకర్యార్థం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో పే ఫోన్ పేరుతో టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశా లల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో గురుకుల పాఠశాలలో ఆరు చొప్పున ఏర్పాటు చేయనుంది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత సోమవారం పెనుకొండ నియోజకవర్గం రొద్దం ఎంజేపీ స్కూలు నుంచి వాటి ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో 40 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తు న్నారు. కుటుంబానికి, తల్లిదండ్రులకు దూరంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతుంటారు. నెలకో, రెండు నెలలకో తల్లిదండ్రి వస్తే వారితో కాసేపు మాట్లాడడం, వారు వెళ్లిపోయాక దిగాలు పడిపోవడం విద్యార్థులకు పరిపాటిగా మారిపోయింది. విద్యార్థుల మానసిక వేదనను గుర్తించిన ప్రభు త్వం గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణ యించింది. ఈ ఫోన్ల ద్వారా తమ తల్లిదండ్రులు, బంధువులతో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుతుంది. తరచూ తల్లిదం డ్రులతో మాట్లాడుతుండడం వల్ల విద్యార్థులకు ఇంటిపై ఉన్న బెంగపోవడంతో పాటు విద్యపై దృష్టి సారించడానికి అవకాశం కలుగుతుందనేది ప్రభుత్వ భావన.

**రోజుకు రెండు గంటల మాత్రమే అవకాశం**

రాష్ట్రంలో ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో ఆరు పే ఫోన్లు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. తల్లిదండ్రులు, బంధువులతో ఫోన్‌లో మాట్లాడానికి రోజుకు రెండు గంటల సమయం కేటా యించనున్నారు. ఉదయం తరగతుల ప్రారంభానికి ముందు ఒక గంట, సాయంత్రం మరో గంట ఫోన్‌లో మాట్లాడానికి అవకాశం కల్పిస్తారు. ఆయా పాఠశాలల సౌలభ్యాన్ని సమయం నిర్ణయించు కునే అవకాశం ప్రిన్సిపాళ్లకు ప్రభుత్వం కల్పించింది.

**స్మార్ట్ కార్డుతో ఫోన్ చేసుకునే వీలు**

విద్యార్థులకు ప్రభుత్వం ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్ కార్డు లు అందజేస్తోంది. ఈ కార్డులకు రూ.10 రీఛార్జి చేయాల్సి ఉం టుంది. ఒక్కో నిమిషానికి ఒక్కో రూపాయి వ్యయమవుతుంది. విద్యార్థులే తమ కార్డులకు రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. విద్యా ర్థి ఎన్ని పర్యాయాలైన స్మార్ట్ కార్డుకు రీఛార్జి చేసుకోవచ్చు. తల్లి దండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నెంబర్లు మాత్రమే ఆ స్మార్ట్ కార్డులో పొందుపరుచుతారు. విద్యార్థులు ఆ ఫోన్ నెంబర్లకు మాత్రమే ఫోన్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న పే ఫోన్లు దుర్వినియోగం కాకుం డా ఉండేలా సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

**కార్పొరేట్ విద్యా సంస్థల తరహాలో..**

కార్పొరేట్ విద్యాసంస్థల్లో పే ఫోన్ల సౌకర్యం ఉంటుంది. ఇప్పుడు అటువంటి అవకాశం ఎంజేపీ స్కూళ్లలో చదువుకునే బీసీ విద్యార్థులకు వచ్చింది. ప్రభుత్వ పరిధిలో ఉన్న మిగిలిన గురుకుల సంక్షేమ పాఠశాలల్లో ఈ తరహా టెలిఫోన్ బాక్సులు ఇంకా ఏర్పా టు చేయలేదు. గురుకుల పాఠశాలల్లో చదివేది అత్యధిక మంది పేద విద్యార్థులే. తమ బిడ్డలను చూసుకోవడం సుదూర ప్రాంతా ల్లో ఉండే పేద తల్లిదండ్రులకు ఆర్థిక భారంతో కూడుకున్నది. పే ఫోన్ల ఏర్పాటుతో తమ బిడ్డలతో రోజూ మాట్లాడుకునే అవకాశం తల్లిదండ్రులకు, బంధువులకు, సంరక్షలకు కలుగుతుంది.

**ప్రభుత్వంపై భారం లేదు..**

110 గురుకుల పాఠశాల్లో ఏర్పాటు చేసే పే ఫోన్ల వల్ల ప్రభు త్వంపై ఎటువంటి భారమూ పడదం లేదు. ఎం.ఆర్.కె.ఆర్. ఐటీ సొల్యూషన్ సంస్థ ఈ ఫోన్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. విద్యా ర్థులు చేసుకునే రీ ఛార్జ్ ఆ సంస్థకు ఆదాయంగా వస్తుంది. కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఇదే తరహాలో టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు.

**పే ఫోన్లతో విద్యార్థులకు మేలు**

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ విద్యార్థుల విద్యకు అధిక ప్రాధా న్యమిస్తోంది. ముఖ్యంగా బీసీ హాస్టళ్లు, గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం పెట్టిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను అధికారంలోకి రాగానే చెల్లించాం. హాస్టళ్ల మరమ్మ తులకు, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశాం. పౌష్టికా హారం అందజేయడంలో మెనూను సక్రమంగా అమలు చేయిస్తు న్నాం. విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నాం. ఇంటిలో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం నిధులు అందజేశాం. రూ.2,250 విలువ కలిగిన డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యా మిత్ర కిట్లు అందజేశాం. గురుకుల పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎంజేపీ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే లక్ష్యం. 110 ఎంజేపీ స్కూళ్లలో పే ఫోన్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుంది. తమ వారితో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుతుంది. దీనివల్ల విద్యార్థు ల్లో మానసిక దృఢత్వం పెరిగి విద్యపై మరింత దృష్టి పెట్టే అవకాశం కలుగుతుంది.

చైతన్యరథం

# అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం

- ప్రజలే ఛీకొడతారు
- మంత్రి నారాయణ మండిపాటు
- వచ్చే ఫిబ్రవరికి గెజిటెడ్ అధికారుల ఇళ్లు పూర్తిచేసి అప్పగిస్తాం
- ఐఏఎస్ అధికారుల టవర్లు దాదాపు పూర్తి



అమరావతి (చైతన్యరథం): కొందరు ఏసీ గదుల్లో కూర్చొని అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పురపాలకశాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. రాజధాని పరిధిలోని నేలపాడులో గెజిటెడ్ అధికారుల టైప్ -1,టైప్ 2 ఇళ్ల నిర్మాణాలను ఆయన ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతిపై సీఆర్డీఏ ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి మునిగిపోయిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే ఛీకొడతారని హెచ్చరించారు. అమరావతిలో మిగిలిన కొద్ది భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిందన్నారు. భూసేకరణ కంటే భూసమీకరణ వల్ల రైతులకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నారు.

అమరావతిలో గెజిటెడ్, గ్రూప్ - డి అధికారుల కోసం మొత్తం 14 టవర్స్‌లో 1440 ఇళ్లు నిర్మిస్తున్నాం. టైప్ -1లో 384 ఇళ్లు, టైప్ - 2లో 336 ఇళ్లు, గ్రూప్ - డి అధికారుల కోసం 720ఇళ్లు నిర్మిస్తున్నాం. డిసెంబర్ 31లోగా అన్ని టవర్లను పూర్తిచేస్తాం. రోడ్లు, డ్రైయిన్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 కి నిర్మాణం పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తాం. ఐఏఎస్ అధికారుల టవర్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. మొత్తం 4400ఇళ్లలో 3750ఇళ్లను వచ్చే మార్చి నాటికి అధికారులకు, ఉద్యోగులకు అప్పగిస్తాం. ట్రంక్ రోడ్లు ఏడాదిలో, లే అవుట్ రోడ్లు రెండున్నరేళ్లలో, ఐకానిక్ టవర్లను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

# ఉల్లి మద్దతు ధరపై దుష్ప్రచారం

- క్వింటాల్‌కు రూ.1200 చెల్లిస్తున్నాం
- రైతులు తక్కువకు అమ్ముకుంటే ధరలో వ్యత్యాసం వారి ఖాతాల్లో జమ
- కర్నూల్ మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ప్రభుత్వం స్పష్టీకరణ



అమరావతి (చైతన్యరథం): ఉల్లికి మద్దతు ధర రూ.1200 అమలు కావటం లేదనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ప్రభుత్వం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. సంచాలకులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆగస్టు 26వ తేదీ నుంచి ఉల్లి క్వింటాల్‌కు రూ. 1200 ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తోంది. ఎవరైనా ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లిస్తోంది. ఈ నెల 6వ తేదీ వరకు కర్నూలు మార్కెట్ యార్డులో 1,139 మెట్రిక్ టన్నుల ఉల్లి కొనుగోలు చేశారు. దాదాపు 775 టన్నులకు వ్యత్యాసం ధర చెల్లించారు. వరుసగా రెండు రోజులు సెలవు దినాలు కావడంతో 6వ తేదీన కర్నూలు మార్కెట్‌కు ఒకేసారి రికార్డు స్థాయిలో ఉల్లి పంట వచ్చింది. 16.598 క్వింటాళ్ల ఉల్లి ఒకేసారి మార్కెట్‌కు రావడంతో కొనుగోలులో జాప్యం జరిగింది తప్ప గిట్టుబాటు ధర చెల్లించడంలో ఎలాంటి పొరబాటు జరగలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగటంతో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ వారికి పరిస్థితిని వివరించి నచ్చచెప్పారు.

గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో అధిక మొత్తములో ఉల్లి కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చింది. గత సంవత్సరం ఆగస్ట్ నెలలో 17102క్వింటాళ్లు రాగా ఈ సంవత్సరం 40785 క్వింటాళ్లు.. అంటే దాదాపు మూడు రెట్లు వచ్చింది. అలాగే గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో 6వ తేదీ నాటికి 6811 క్వింటాళ్లురాగా ఈ సంవత్సరము అదే తేదీ నాటికి 27,137 క్వింటాళ్లు.. దాదాపు నాలుగు రెట్లు అధికంగా వచ్చింది.

ఈ విషయాన్ని రైతులకు కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ కూలంకుషంగా వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారు మార్కెట్ యార్డులో వ్యాపారులకు ఎంత ధరకు విక్రయించినప్పటికీ క్వింటాల్‌కు రూ. 1200/- చొప్పున వచ్చే విధంగా ధరలో వ్యత్యాసాన్ని మార్క్-ఫెడ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతుల బ్యాంకు ఖాతాల్లో మిగిలిన నగదు జమ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఆదివారం కూడా కొనుగోళ్లు జరుగుతాయని తెలియజేయడంతో రైతులు ఆందోళనను విరమించారు.

ఎక్కువ పంట వచ్చినందున ఆదివారం సైతం మార్కెట్ యార్డు పనిచేసింది. ఉల్లి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, భోజన సదుపాయం సైతం ఏర్పాటు చేశాం. ఎండలో ఇబ్బంది పడకుండా వేచి ఉండేందుకు టెంట్లు ఏర్పాటు చేశాం. పంట అమ్ముకునే రైతులకు టోకెన్ పద్ధతి అమలు చేస్తున్నాం. రైతుల నుండి కొనుగోలు మొదలు నగదు చెల్లింపుల వరకు ఇతర జిల్లాల అదనపు సిబ్బందితో వివిధ కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. ఎంత పెద్ద మొత్తంలో పంట వచ్చినా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉల్లి రైతుల్లో ఆందోళన రేకెత్తించేందుకు జరుగుతున్న రాజకీయ కుట్రలను ఎవరూ నమ్మవద్దు. ఇది రైతు ప్రభుత్వం. ఇప్పటికే మిర్చి, పొగాకు, మామిడి రైతుల విషయంలో కూడా రాజకీయ కుట్ర జరిగినా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో లేని పరిణామాల వల్ల ధర రాకపోయినా రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సకల చర్యలు తీసుకుని మద్దతు ధర ఇస్తుందని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# మెడికల్ కాలేజీలపై వైసీపీ దుష్ప్రచారం



- అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- పీపీపీ విధానంలో నిర్మాణాల్లో వేగం పెరుగుతుంది
- వాటిపై నియంత్రణ, యాజమాన్య హక్కు ప్రభుత్వానిదే
- జగన్‌రెడ్డి 17 కాలేజీలు తెచ్చానని చెప్పుకుంటూ ఒక్క దానినీ పూర్తిచేయకపోవడం సిగ్గుచేటు
- పూర్తికాని వాటిని ఎలా ప్రైవేట్‌పరం చేస్తామో చెప్పాలి
- పేద విద్యార్థులకు ద్రోహం చేసిన వారా మాట్లాడేది
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ధ్వజం

అమరావతి (చైతన్యరథం): కొత్తగా నిర్మించే మెడికల్ కాలేజీల ను ప్రైవేటు పరం అంటూ గత పాలకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. పీపీపీ విధానం లో మెడికల్ కాలేజీల నిర్మాణంపై జగన్‌రెడ్డి అండ్ కో చేస్తున్నవి అసత్య ఆరోపణలుగా కొట్టిపారేశారు. మెడికల్ కాలేజీను ప్రభు త్వాలు నిర్వహించడం కన్నా ఆయా రంగాల్లో నిపుణులైన వారు నిర్వహిస్తే ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయన్న భావనతో పీపీపీ విధానం ద్వారా నిర్మాణాల్లో వేగం పెరుగుతుందని, నిర్మాణం పూర్తైన అనంతరం కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందని స్పష్టం చేశారు. తద్వారా వైద్య విద్య ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వంపై భారం తగ్గుతుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా పీపీపీ విధా నంలో నిర్మిస్తున్న కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ప్రతి మెడికల్ కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా పెరిగే అవకా శం ఉందని పేర్కొన్నారు. వైద్య విద్య, ఆరోగ్య సేవలను మెరుగు పరచడానికి కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కానీ విపక్షం ఈ వాస్తవాలను పక్కన పెట్టి రూ.8,500 కోట్ల విలువైన కాలేజీలను రూ.5,000 కోట్లకు బినామీలకు లీజుకు ఇస్తున్నారని వక్రీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. అసలు నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా సగంలో పెట్టి ఏదో విపక్ష నేత సంపాదించి పెట్టిపోయిన ఆస్తిని అమ్మేస్తున్నట్లుగా బిల్డప్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో మూలనపడ్డ కాలేజీలను మళ్లీ పీపీపీ విధానంలో పట్టాలు ఎక్కించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. సుదీర్ఘ కసరత్తు చేసి కేబినెట్‌లో సమగ్రంగా చర్చించి తీసుకున్న నిర్ణయాన్ని గత పాలకులు తప్పుడు ప్రచారం తో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరైన విధానం కాదని హెచ్చరించారు.

**సెల్ఫ్ ఫైనాన్స్ విధానం తెచ్చింది జగన్‌రెడ్డే..**

సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అని మెడికల్ సీట్ల ఫీజును రూ.12 లక్షలు చేసి అమ్ముకానికి పెట్టే విధానాన్ని తెచ్చిన జగన్‌రెడ్డి నేడు పీపీపీ విధానాన్ని తప్పు పట్టడం విచిత్రంగా ఉంది. తాము 17 మెడికల్ కాలేజీలు కడితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేస్తుందని..ఆయన చేస్తున్నది విష ప్రచారం. గత ప్రభుత్వంలో మార్కాపురం కాలేజీని 17 శాతం, మదనపల్లె కాలేజీని 12 శాతం, పులివెందుల కాలేజీని 77 శాతం, ఆదోని కాలేజీ కేవలం 15 శాతం మాత్రమే పూర్తి చేశారు. 17 కాలేజీలు తెచ్చానని చెప్పుకున్న ఆయన ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తిచేయలేదు. అన్ని కాలేజీలకు కలిపి రూ.8,500 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా వారి హయాంలో కేవలం 17 శాతం మాత్రమే ఖర్చు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 5 కాలేజీలు నిర్మించినట్లు చెప్పుకుం టున్న కాలేజీల్లోనూ క్లాసులు కూడా ప్రారంభం కాలేదు.

కనీసం సిబ్బందిని కూడా నియమించలేదు. హాస్టళ్లు అందుబాటులో లేవు.. అడ్మినిస్ట్రేషన్ విధానం లేదు. 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో అరకొర వసతులతోనే కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఇవే ఇలా ఉంటే మిగతా వాటి పరిస్థితి ఏంటి? అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుంటే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాల్సిన విపక్ష పార్టీ మాత్రం విమర్శలకే పరిమితమైందని మండిపడ్డారు.

**మెడికల్ కాలేజీల పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25లో పాడేరులో మెడికల్ కళాశాల ప్రారంభించింది. అదేవిధంగా మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందుల, నర్సీపట్నం, అమ లాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుకొండ కళాశాలల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మిగిలిన 10 కళాశాలలను వేగవంతంగా పూర్తిచేసి వైద్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రెండు దశల్లో పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో భాగంగా మొదటి దశలో ఆదోని, మార్కాపురం, మదన పల్లె, పులివెందుల కళాశాలలను వేగవంతంగా పూర్తి చేసి వినియో గంలోకి తెచ్చే పనిలో ప్రభుత్వం ఉంది. 2వ దశలో అమలాపురం, నర్సీపట్నం, పాలకొల్లు, బాపట్ల, పెనుకొండ, పార్వతీపురంలో నిర్మించేందుకు నిర్ణయించింది. ఆసుపత్రిని నిర్మించి నిర్వహించి, ఆ తర్వాత నిర్ణీత కాలానికి ప్రభుత్వానికి తిరిగి అప్పగించేలా ఒప్పందం చేసుకున్నాం. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా కాలేజీలను అప్‌గ్రేడ్ చేసి ఏడాదిలో కనీసం ఒక్కో కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని స్పష్టం చేశారు.

**వైసీపీ ఆరోపణలు అవాస్తవాలు**

ఓ వైపు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ లు పూర్తి చేసి సీట్లు అందుబాటులోకి తెస్తుంటే ప్రైవేట్ పరం అంటూ గగ్గోలు చేస్తున్న విపక్షానికి విద్యార్థుల భవిష్యత్ పట్టదా? వైద్య విద్య పేద విద్యార్థులకు దూరం అవుతుందని గత పాలకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. మొన్నటివరకు రాజధాని మునిగిందని, విజయవాడను మళ్లీ వరదలు ముంచెత్తాయని విష ప్రచారం చేశారు. తాజాగా మళ్లీ మెడికల్ కాలేజీలపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది ఎంతవరకు సబబు? ప్రజల్లో విశ్వాసం, నమ్మకం కోల్పోయి రాష్ట్రంలో నిత్యం ప్రజలను తప్పుదా రి పట్టించే ప్రయత్నంలోనే గత ప్రభుత్వ పాలకులు నిమగ్నమ య్యారు. వారి హయాంలో పూర్తి చేయని మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ఏ విధంగా ప్రైవేట్‌పరం చేస్తుందో గత పాలకులు చెప్పాలని ప్రశ్నించారు.

ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మాణ సంస్థలు 420 పడకల ఆసుపత్రులను నిర్వహించి, వాటిని నేషనల్ మెడికల్ కమిషన్ ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేసేలా ఒప్పందం కుదిరింది. పీపీపీ విధానంలో నిర్మి ంచిన ఆసుపత్రుల్లో అందరికీ అందుబాటులో, తక్కువ ఖర్చుతో వైద్యం ఉండేలా నిబంధనలు ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇందులో ఓపీ పూర్తిగా ఉచితం. రోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిం ది. ఇన్-పేషెంట్ సేవల్లో 70 శాతం పడకలకు పీఎంజేఏవై, ఎన్టీఆర్ వైద్యసేవ, సీజీహెచ్ఎస్ వంటి ప్రభుత్వ పథకాల లబ్ధిదా రులకు ఉచితంగా సేవలు అందిస్తుంది. ఓపీడీ రోగులకు ఉచి తంగా జనరిక్ మందులను అందజేస్తున్నాం. అన్నీ తెలిసినా కూడా గత పాలకులు తమ అధినేత ఏదో చేశాడని చెప్పుకోవ డానికి తంటాలు పడుతున్నారు. పేద విద్యార్థులకు తీరని ద్రోహం చేసింది గత ప్రభుత్వం కాదా? నాడు కట్టని మెడికల్ కాలేజీలకు నేడు ఎందుకంత హడావిడి చేస్తున్నారో వారికే విజ్ఞతకే తెలియాలని పేర్కొన్నారు.

# ప్రపంచ ఆర్చరీలో భారత్ అత్యుత్తమ ప్రదర్శన

- ఉత్కంఠగా భారత్-నెదర్లాండ్ ఫైనల్ మ్యాచ్
- సిల్వర్ మెడల్ సాధించిన భారత ఆర్చర్లు
- క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందన



విజయవాడ (చైతన్యరథం): అంతర్జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్న భారత ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్‌లకు శాప్ చైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో హ్యుందాయ్ అంతర్జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఉత్కంఠభరితంగా సాగింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో నెదర్లాండ్ టీమ్‌పై భారత ఆర్చర్‌లు జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రజత పతకం సాధించారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తమదైన శైలిలో ప్రతిభను కనబరిచారు. 74 దేశాల మధ్య జరిగిన వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత సత్తా చాటిచెప్పారంటూ శాప్ చైర్మన్ ప్రశంసించారు. 2021 తర్వాత వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇది రెండవ సిల్వర్ మెడల్ కావడం హర్షణీయమని వివరించారు. ఫైనల్ మ్యాచ్‌లో అసామాన్యమైన ప్రదర్శన భారత క్రీడాకారులకు, దేశ ప్రజలకు గర్వకారణం.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి క్రీడాప్రపంచానికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

- అందుబాటులోకి రానున్న 1,000 పడకలు
- గుంటూరు జీజీహెచ్‌కు 500, కాకినాడకు 500
- రూ.128 కోట్లతో రెండు నూతన ఎంసీహెచ్ బ్లాకులు
- రు.51 కోట్లతో వైద్య పరికరాలకు మంత్రి ఆమోదం

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వాస్పత్రుల్లో మాతా, శిశు వైద్యసేవలు విస్తరించి గర్భిణులు, నవజాత శిశువుల మరణాలను తగ్గించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఒక అడుగు ముందుకుపడనుంది. గుంటూరు, కాకినాడ సర్వజన ఆస్పత్రు (జీజీహెచ్)ల్లో రెండు నూతన ఎంసీహెచ్ (మదర్ అండ్ చైల్డ్ కేర్) బ్లాకుల ద్వారా సేవలను పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ రెండు బ్లాకుల్లో వైద్యసేవలందించేందుకు అవసరమయ్యే వైద్య పరికరాలు, ఇతర వస్తువులను రూ.51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.



**రెండు నూతన ఎంసీహెచ్ బ్లాకులు**

గుంటూరు జీజీహెచ్‌లో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో రూ.86 కోట్లతో నిర్మించబడుతున్న నూతన ఎంసీహెచ్ బ్లాకు త్వరలో పూర్తి కానుంది. దీనిలో 500 పడకల ద్వారా మాతా, శిశు వైద్యసేవలను విస్తృతం చేయనున్నారు. ఇదే విధంగా కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.46 కోట్లతో నిర్మాణంలో ఉన్న మరో ఎంసీహెచ్ బ్లాకు కూడా త్వరలో పూర్తి కానుంది. దీనిలో కూడా మరో 500 పడకలతో సేవలందించేదుకు వీలుంది.

**రూ.51 కోట్లతో వైద్య పరికరాలు**

ఈ రెండు ఎంసిహెచ్ బ్లాకుల ద్వారా సేవలందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, అనుబంధ సామ్రగిని రూ.51. 33 కోట్లతో కొనుగోలు చేయడానికి మంత్రి అనుమతించారు. మొత్తం 332 రకాలకు చెందిన 5,687 పరికరాలు, సామ్రగిని కొనుగోలు చేస్తారు. గుంటూరు జీజీహెచ్‌లో 37 రకాలకు చెందిన 1,187 పరికరాలను రూ.23.51 కోట్లతో అందజేస్తా రు. కాకినాడ జీజీహెచ్‌లో 295 రకాలకు చెందిన 4,500 పరికరాలను రూ.27.82 కోట్లతో ఏర్పాటు చేస్తారు. ఈ కొత్త బ్లాకుల కోసం పడకలు, బెడ్లు, ఐసీయూ బెడ్లు, పేషెంట్ మాని టర్లు, వెంటిలేటర్లు, డీఫిబ్రిరేటర్లు, ఈసీజీ మెషీన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, మొబైల్ ఆల్ట్రా సౌండ్ మెషీన్లు, నిబులైజర్లు, డెలివరీ సెట్లు, ఆక్సీ మీటర్లు, ఫొటో థెరపీ యూనిట్లు, సర్జికల్ చైర్లు వంటి పలు రకాల వైద్య పరికరాలను భారీస్థాయిలో కొనుగోలు చేయనున్నారు.


**మంత్రి అభినందనలు**

ఈ రెండు ఆస్పత్రుల్లో ఎంసీహెచ్ బ్లకుల నిర్మాణానికి ముందుకొచ్చిన గుంటూరు మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఈ బ్లాకుల నిర్మాణాలకు కృషి చేసిన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, సిబ్బందిని ప్రశంసించారు.

# వైసీపీ మారీచులను తరిమికొట్టాలి

- హామీలను నెరవేర్చకుండా జగన్‌రెడ్డి దగా చేశాడు
- మోసాన్ని గ్రహించే గత ఎన్నికల్లో ఇంటికి పంపారు
- అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము లేక విష ప్రచారం
- అన్ని వర్గాల ప్రజలు ఛీకొట్టినా వారికి బుద్ధి రాలేదు
- సూపర్ సిక్స్‌తో చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు
- ప్రజలు ఇది మంచి ప్రభుత్వమని మెచ్చుకుంటున్నారు
- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

మంగళగిరి (చైతన్యరథం): ప్రభుత్వంపై బురద జల్లుతున్న వైసీపీ మారీచులను తరిమికొట్టాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పిలుపునిచ్చారు. మంగ ళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో చంద్రబాబు అధికారం చేపట్టిన ఈ 15 నెలల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారు..ఎన్నికల్లో ఇచ్చిన హామీ లన్నింటినీ నెరవేర్చారు. సూపర్‌సిక్స్ అమలు చేసి మాట నిలబెట్టు కున్నారని పేర్కొన్నారు. జగన్ రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల పైచి లుకు అప్పుల్లో ముంచి వెళ్లాడు. చంద్రబాబు ఆధ్వర్యంలోని కూట మి ప్రభుత్వం ఆ అప్పులను తీరుస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ముందుకుసాగుతుంద న్నారు. వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ బుద్దిలేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము, ధైర్యంలేక విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చం ద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల ను అద్భుతంగా అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రజలు కూడా సంతో షంగా ఉన్నారు. 1984లో ఎన్టీఆర్ పెన్షన్లను ప్రారంభించారు. 2014–19లో రూ.200 ఉన్న పెన్షన్‌ను చంద్రబాబు రూ.2 వేలకు పెంచారు. జగన్‌రెడ్డి పెన్షన్లు రూ.3 వేలు పెంచుతామని చెప్పి ఏడాదికి 250 చొప్పున పెంచుతూ ఐదేళ్లపాటు మోసగిం చాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్లు పెంచారు. 67 లక్షల మందికి పైగా పెన్షన్లు ఇస్తూ రికార్డు సృష్టించారు. దివ్యాంగులకు 3 వేల నుంచి 6 వేలకు పెన్షన్లు పెంచారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలకు పెన్షన్లను పెంచారు. దేశ చరిత్రలోనే అత్యధిక పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజల మన్ననలు పొందుతోంది. అలాగే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళు తున్నారు. కేవలం15 నెలల కాలంలోనే 10.5 లక్షల కోట్ల పెట్టుబడులతో 9 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసు కుంది. మంత్రి లోకేష్ 16,347 డీఎస్సీ పోస్టులతో నిరుద్యోగులకు ఇచ్చిన మాట నెరవేర్చారు. పోలీసు శాఖలో 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేశారు. వైసీపీ పాలనలో పీరియాడిక్ లేబర్ సర్వే నివేదిక ప్రకారం 24 శాతం నిరుద్యోగంతో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. వైసీపీ హయాంలో ఉద్యోగాలు లేక 4 వేల వంద మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కూట మి ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంది. అందుకే నిరుద్యో గులు షబాష్ అంటున్నారు. ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. జగన్ అన్నదాతలకు ఇస్తానన్న పెట్టుబడి సాయం ఇవ్వకుండా మోసం చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్న దాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14 వేలు కాగా.. కేంద్ర ప్రభుత్వ వాటా రూ.6 వేలు. రాష్ట్రవ్యాప్తంగా రూ.46,85,836 మంది రైతులను అర్హులుగా గుర్తించి కూటమి ప్రభుత్వం రూ.2,342.92 కోట్లు, కేంద్రం పీఎం కిసాన్ కింద రూ.831.51 కోట్లు.. కలిపి మొత్తం తొలి విడతగా రూ.3,174. 43 జమ చేసింది. తొలి విడతగా



కేంద్రం వాటా రూ.2 వేలు, రాష్ట్ర వాటా రూ.5 వేలు కలుపుకొని రూ.7 వేలు ఆగస్టు 2 రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి వెళ్లినా చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిన పెడుతూ.. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అండగా ఉన్నారు. వైసీపీ రైతులకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా వారిని నట్టేట ముంచింది.

**తల్లికి వందనం, దీపం2తో వెలుగులు**

వైసీపీ ప్రభుత్వం ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మ ఒడి కింద డబ్బులు ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇచ్చి మోసగించింది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున వర్తింపజేస్తూ నగదు జమ చేసింది. 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 8,745 కోట్లు కూటమి ప్రభుత్వం జమ చేసింది. గత ప్రభుత్వంలో కన్నా 25 లక్షల మంది అదనంగా లబ్ధి పొందుతున్నారు. ఇందుకు గత ప్రభుత్వం కంటే రూ.3,205 కోట్లు అదనంగా కూటమి ప్రభుత్వం ఖర్చు చేసింది. నిరుపేద తల్లిదండ్రులు తమ జీవితాల్లో వెలుగులు నింపారని ఆనందపడుతున్నారు. అలాగే దీపం 2 పథకంతో గత ఏడాది నవంబర్ 1న దీపావళి నుంచి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అమలు చేస్తున్నారు. మొదటి విడతగా గత మార్చి 31 నాటికి 93.03 లక్షల సిలిండర్లు, రెండవ విడతగా ఏప్రిల్ నుంచి జూలై 31 మధ్య 93.46 లక్షల సిలిండర్లు కూటమి ప్రభుత్వం అందజేసింది. ఇందుకుగాను రూ.747 కోట్లు ఖర్చు చేసింది. ఇంకా గ్యాస్ కంపెనీల వద్ద రూ.35 కోట్లు ఉన్నాయి. ఆగస్టు 1 నుంచి 3వ విడత సిలిండర్ల పంపిణీ కూడా ప్రారం భమైంది. చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకు న్నారు.

**స్త్రీశక్తితో ఆర్థిక ప్రయోజనం**

స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్టు 15న ప్రారంభించి మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేశారు. మొదటిరోజే 8 లక్షల మంది మహిళలు ప్రయాణం చేశారు. ఇప్పటివరకు కోటి మందికి పైగా మహిళలు దీన్ని వినియోగించుకున్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.95 కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకంతో ప్రభుత్వానికి ఏటా రూ.2 వేల కోట్ల భారం పడుతున్నా.. చంద్ర బాబు ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రతి మహిళకు నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఆదా అవుతోంది. దీంతో వారు ఆనందపడుతున్నారు. రానున్న రోజుల్లో కూడా ఉచిత బస్సు ప్రయాణం చేసే మహిళలకు స్మార్ట్ కార్డు జారీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. స్త్రీ శక్తి పథకం కింద 8,458 బస్సులను కేటాయించారు. జగన్ హయాంలో ఆర్టీసీ ఛార్జీలను పెంచి దోపి డీ చేశారు. ఆడబిడ్డకు అండగా నిలిచేందుకు తెచ్చిన పెళ్లి కాను క కూడా జగన్‌రెడ్డి రద్దు చేశాడు. అలాగే 10 వేల కోట్ల పొదుపు నగదు, రూ.2,100 కోట్ల అభయ హస్తం నిధులను జగన్‌రెడ్డి దోచేశారు. డ్వాక్రా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. అంతేకాకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు అమలు చేస్తున్న పథకాలను కూడా నిలిపివేశారు. అన్ని వర్గాలకు ద్రోహం చేశాడు. బటన్ నొక్కుతూ ప్రజలను మోసం చేశాడు. ఈ మోసాన్ని ప్రజలు గ్రహించి 2014 ఎన్నికల్లో 11 సీట్లతో ఇంటికి పంపారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలతోపాటు పీ4 కింద గ్రామాల్లో నిరుపేద కుటుబాల్ని గుర్తించి వారిని ఆదుకు నేందుకు మార్గదర్శులను ఎంపికేచేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఆర్థిక అసమానతలను రూపుమాపేం దుకు చంద్రబాబు కృషి చేస్తున్నారు. అనంతపురంలో ఈ నెల 10న "సూపర్ సిక్స్–సూపర్ హిట్" పేరుతో భారీ బహిరంగ సభ జరగనుంది. ప్రజలు వాస్తవాలు గ్రహించి వైసీపీ విష ప్రచారాల్ని నమ్మొద్దని, కూటమి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. వైసీపీ మారీచులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

# స్త్రీ శక్తి పథకంతో సాధికారత దిశగా మహిళలు

● 7వేల మంది మహిళలతో సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ర్యాలీ



సాలూరు (చైతన్యరథం): స్త్రీ శక్తి పథకం మహిళా లోకానికి మరో నవశకమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సాంఘిక శక్తివంతం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్త్రీ శక్తి పథకం" ద్వారా వేలాది మహిళలకు మేలుచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం నుండి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వరకు ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. సుమారు 7,000 మంది మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై, ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పథకం ద్వారా మహిళలకు ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కల్పించబడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 11,449 బృందాలు ఏర్పడి, 8,458 బృందాలు విజయవంతంగా కార్యకలాపాలు చేపట్టాయి. మొత్తం ఇప్పటి వరకు రూ.162 కోట్ల రుణాలు, రూ.1,942 కోట్ల సహకార నిధులు అందించబడ్డాయి. ప్రతి బృందానికి 100% సబ్సిడీతో రుణసౌకర్యం కల్పిస్తూ, మహిళలు స్వయం ఉపాధిలో ముందడుగు వేయడానికి అవకాశం కల్పించబడింది. ఈ పథకం కింద 25 లక్షల కంటే ఎక్కువ మహిళలు ఇప్పటికే లబ్ధి పొందారు. చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు, కృషి ఆధారిత రంగాలు, సేవా రంగం మొదలైన విభాగాల్లో మహిళలకు ఉపాధి మార్గాలు సృష్టించబడుతున్నాయి. "స్త్రీ శక్తి పథకం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు. ఇది మహిళల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక." అని మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యానించారు.

## పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు : మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి (చైతన్యరథం): పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలికి చెందిన సీనియర్ నాయకులు బగాది శేషగిరిరావును ఇటీవల ప్రభుత్వం కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆదివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్, డైరెక్టర్లు టెక్కలి మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు గౌరవ మంత్రి వర్యులను మర్యాద పూర్వకంగా కలిసారు. తమకు సముచిత స్థానం కల్పించి నందుకు మంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. టెక్కలి మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖలో మహిళల ప్రపంచకప్... తొలి మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా మంత్రి లోకేశ్



విశాఖపట్నం (చైతన్యరథం): మహిళల క్రికెట్ ప్రపంచకప్ 2025 మ్యాచ్లకు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. ఈ నేపథ్యంలో ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మహిళల ప్రపంచకప్ ట్రోఫీని ఏసీఏ ప్రధాన కార్యదర్శి సానా సతీశ్, ఏసీఏ సభ్యులు ఆవిష్కరించారు. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్లు విశాఖలో జరగనున్నట్లు సానా సతీశ్ తెలిపారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మహిళా క్రికెటర్లు విశాఖకు వస్తున్నట్లు చెప్పారు. తొలి మ్యాచ్కు మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రంలో మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఆలోచనతో మంత్రి లోకేశ్ ముందుకు వెళ్తున్నారని తెలిపారు. క్రికెట్తోపాటు ఇతర క్రీడల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తామన్నారు.

## విశాఖలో పెట్రోలియం కంపెనీపై పిడుగు... భారీగా చెలరేగిన మంటలు



విశాఖపట్నం (చైతన్యరథం): నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఈస్ట్ఇండియా పెట్రోలియం కంపెనీపై పిడుగు పడింది. కంపెనీలోని పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగు పడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. విశాఖలో అగ్నిప్రమాద ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. అగ్నిమాపకశాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

# సమాజానికి స్వచ్ఛంద సంస్థలతో ఎంతో మేలు

● విజయవాడ 33వ డివిజన్‌లో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్,



విజయవాడ (చైతన్యరథం): స్వచ్ఛంద సంస్థలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం లోని 33వ డివిజన్ ముత్యాలంపాడు, సత్యనారాయణపురం ప్రాంత ప్రజలకు ఉచితంగా శుద్ధి చేసిన మంచినీటిని అందించేందుకు ఏపీ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డి.జె.పి.ఎన్. రాజు తన సొంత నిధులతో శ్రీ దుర్గా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యాధునిక రివర్స్ ఆస్మాసిస్ (ఆర్వో) ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ కలిసి ప్రారంభించారు. అనంతరం శ్రీ దుర్గా చారిటబుల్ ట్రస్ట్ , డి.జె.పి.ఎన్. రాజుని ముఖ్య అతిథులు అభినందించారు ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ

●రూ.19 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించిన మంత్రి సుభాష్



కె.గంగవరం (చైతన్యరథం): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె గంగవరం మండలం దంగేరు గ్రామంలో రూ.19 లక్షల రూపాయలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను మంత్రి సుభాష్, స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. తొలుత రావిపాటి వెంకట గణేష్ చౌదరి ఇంటి వద్ద నుంచి నిర్మించిన రోడ్డు రూ.8 లక్షలు, దొమ్మేటి రాముడు ఇంటి నుంచి రూ. 5.3 లక్షలతోనూ, సూరవరపు సూర్యనారాయణ ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన రోడ్డుకు రూ.2.70 లక్షలు, సత్తి సత్యనారాయణ ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన రోడ్డు 3 లక్షలు మొత్తం రూ. 19 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులతో ఈ రోడ్ల నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఆయా గ్రామాలను సుందరీ కరిస్తామన్నారు. గడిచిన ఏడాది కాలంలో రామచంద్రపురం నియోజవర్గంలో రూ.125 కోట్లు నిధులతో అభివృద్ధి చేశామన్నారు. భవిష్యత్తు కాలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం చేపట్టి ప్రజల కనీస అవసరాలు పూర్తిస్థాయిలో తీరుస్తామన్నారు. గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం కూడా శోభాయ మానంగా ఉంటుందన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా తన ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శివ ప్రసాద్, కూటమి పార్టీ నాయకులు వెంకట గణేష్ చౌదరి, సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాపై నానా యాగీ చేస్తున్న వైసీపీ నాయకులు

●ఎరువుల కొరత ఉందని జగన్ నిరూపించాలి : వర్మ



పిఠాపురం (చైతన్యరథం): యూరియా సరఫరాపై వైసీపీ నాయకులు అనవసరంగా నానా యాగీ చేస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని టీడీపీ నాయకుడు ఎస్వీ.ఎస్.ఎన్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం గొల్లప్రోలు టౌన్‌లో రైతులకు యూరియా బస్తాలు అందజేశారు. అనంతరం పొలంలోకి దిగి యూరియా చల్లారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ... ఎరువుల కొరత ఉందని జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలెవరూ నమ్మొద్దన్నారు. వైసీపీ నెగ్గిన 11 నియోజకవర్గాల్లో సైతం నూటికి నూరు శాతం ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంలోని రైతాంగానికి అన్నదాత సుఖీభవ పథకం అందిందని అన్నారు. నేడు కాకినాడ జిల్లాలో 23,356 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందని, ప్రభుత్వం 18,635 టన్నులు యూరియా రైతాంగానికి సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇంకా 200 మెట్రిక్ టన్నుల యూరియా రేపటిలోగా అందుబాటులో ఉంటుందన్నారు. దేశం మొత్తం ఎరువులు రైతులకు ఇబ్బంది ఉన్నా కానీ, ఒక్క ఆంధ్రప్రదేశ్లోనే చంద్రబాబు నాయకత్వంలో ప్రతి రైతుకి యూరియా కొరత లేకుండా చేశారని అన్నారు. ఏ ఊర్లో, ఏ మండలంలో, ఏ నియోజకవర్గంలో, ఏ జిల్లాలో యూరియా అందుబాటులో లేదో చూపించాలని జగన్‌కు వర్మ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ, కదారి బాబ్జి, వైస్ చైర్మన్ గాది రాజుబాబు, శీరం మాణిక్యం, వెన్నా బాపిరాజు, కొత్తలంక వీరభద్రచార్యులు, దొమ్మేటి మనోహర్, శౌర్య, రైతులు, మరియు తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లాలో ఎరువుల కొరత లేదు



విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో ఎరువులకు కొరత లేదని, అవసరమైన ప్రాంతాలకు సమయానికి సరఫరా చేస్తామని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పష్టం చేశారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో 30మంది రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. 25 మంది రైతులు రెండో విడత ఎరువులు అందడంలేదని ప్రస్తావించగా, కలెక్టర్ స్పందిస్తూ, రెండో విడత యూరియా వేయడానికి ఇంకా సమయం ఉందని, శాస్త్రవేత్తల సూచన మేరకు పంట వేసిన 35-40 రోజుల తరువాత మాత్రమే ఎరువులు వేయాలని సూచించారు.

# వైద్య విద్యను జగన్ వ్యాపార వస్తువుగా మార్చారు

**●ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించని జగన్, మెడికల్ కాలేజీలు కట్టానంటే ప్రజలు నమ్ముతారా? : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): "తన పాలనలో వైద్య విద్యను జగన్ వ్యాపార వస్తువుగా మార్చారు. ప్రకృతి వనరులు, ప్రభుత్వ ఆస్తులు అమ్మినట్టే మెడికల్ సీట్లు అంగడి సరుకుగా మార్చిన ఘనుడు జగన్. భావివైద్యుల బంగారు భవిష్యత్తును తన అవినీతికి పణంగా పెట్టిన డబ్బుమనిషి. కళాశాలలు నిర్మించకుండా, వసతులు లేకుండా మొక్కుబడిగా ప్రారంభించి వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకోవడానికి జగన్ ఆరాటపడ్డారు. రాష్ట్రప్రభుత్వం నుంచి రూపాయి విడుదల చేయకుండా కాలేజీలు ఎలా నిర్మించారో జగన్ చెప్పాలి. నిధులు ఇవ్వకుండా 17 మెడికల్ కాలేజీలు తానే కట్టించినట్టు, రాష్ట్రానికి కొత్తగా వైద్యవిద్యను పరిచయం చేసినట్టు దుష్ప్రచారం చేసుకోవడం జగన్ లాంటి అవకాశవాదికే చెల్లింది. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించని వారు మెడికల్ కాలేజీలు కట్టారంటే ప్రజలు నమ్ముతారా? జగన్ ఎగనామం పెట్టిన రూ.4,300 కోట్ల బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించింది నిజం కాదా? అబద్ధమనే బురదలో పెరిగిన అవినీతి చెట్టుకు కాసిన పిచ్చికాయ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ఆ కాయ విషం రుచిచూసే ఐదేళ్లపాటు ఏపీ ప్రజలు నరకయాతన పడ్డారు. ఒక వైద్యుడి కొడుకుగా పుట్టి... వైద్యవిద్యను నిర్లక్ష్యం చేసినందుకు జగన్ నిజంగా సిగ్గుపడాలి. రాష్ట్ర వైద్యరంగాన్ని భ్రష్టు పట్టించి, ప్రభుత్వ వైద్యాన్ని నీరుగార్చి, కల్తీమద్యంతో పేదల ఉసురు తీసిన పాపం జగన్ కుటుంబాన్ని తరతరాలు వెంటాడుతుంది." అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.

**ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించని జగన్... మెడికల్ కాలేజీలు కట్టానంటే ప్రజలు నమ్ముతారా? : ప్రత్తిపాటి**

"తన పాలనలో వైద్య విద్యను జగన్ వ్యాపార వస్తువుగా మార్చారు. ప్రకృతి వనరులు, ప్రభుత్వ ఆస్తులు అమ్మినట్టే మెడికల్ సీట్లు అంగడి సరుకుగా మార్చిన ఘనుడు జగన్. భావివైద్యుల బంగారు భవిష్యత్తును తన అవినీతికి పణంగా పెట్టిన డబ్బుమనిషి. కళాశాలలు నిర్మించకుండా, వసతులు లేకుండా మొక్కుబడిగా ప్రారంభించి వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకోవడానికి జగన్ ఆరాటపడ్డారు. రాష్ట్రప్రభుత్వం నుంచి రూపాయి విడుదల చేయకుండా కాలేజీలు ఎలా నిర్మించారో జగన్ చెప్పాలి. నిధులు ఇవ్వకుండా 17 మెడికల్ కాలేజీలు తానే కట్టించినట్టు, రాష్ట్రానికి కొత్తగా వైద్యవిద్యను పరిచయం చేసినట్టు దుష్ప్రచారం చేసుకోవడం జగన్ లాంటి అవకాశవాదికే చెల్లింది. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించని వారు మెడికల్ కాలేజీలు కట్టారంటే ప్రజలు నమ్ముతారా? జగన్ ఎగనామం పెట్టిన రూ.4,300 కోట్ల బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించింది నిజం కాదా? అబద్ధమనే బురదలో పెరిగిన అవినీతి చెట్టుకు కాసిన పిచ్చికాయ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ఆ కాయ విషం రుచిచూసే ఐదేళ్లపాటు ఏపీ ప్రజలు నరకయాతన పడ్డారు. ఒక వైద్యుడి కొడుకుగా పుట్టి... వైద్యవిద్యను నిర్లక్ష్యం చేసినందుకు జగన్ నిజంగా సిగ్గుపడాలి. రాష్ట్ర వైద్యరంగాన్ని భ్రష్టు పట్టించి, ప్రభుత్వ వైద్యాన్ని నీరుగార్చి, కల్తీమద్యంతో పేదల ఉసురు తీసిన పాపం జగన్ కుటుంబాన్ని తరతరాలు వెంటాడుతుంది." అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# సాంస్కృతిక వైభవం దేశమంతా చాటి చెప్పేలా విజయవాడ ఉత్సవ్

**●మురళీ గార్డెన్స్‌లో ఘనంగా విజయవాడ ఉత్సవ్ కర్టెన్ రైజర్ ప్రోగ్రామ్**

**●ముఖ్యఅతిథులుగా హాజరైన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణా ప్రసాద్**

**●ప్రత్యేక అతిథులుగా హాజరైన సంయుక్త మీనన్, దివి వద్యా, మానస వర్షిణి**

**●కిష్కందపురి మూవీ టీమ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుమప పరమేశ్వరన్ సందడి**




విజయవాడ (చైతన్యరథం): పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక వైభవానికి విజయవాడ వేదిక కానుంది. సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారాంతో దసరా సందర్భంగా విజయవాడలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించబోయే విజయవాడ ఉత్సవ్ పీపుల్ పార్టిసిపేషన్ ఫెస్టివల్ అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ ఉత్సవ్‌తో విజయవాడ సాంస్కృతిక వైభవం దేశమంతా ప్రతిధ్వనిస్తుందన్నారు. 'సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ' సారథ్యంలో ఏపీ ప్రభుత్వ సహకారంతో జరగబోయే 'విజయవాడ ఉత్సవ్' కర్టెన్ రైజర్ కార్యక్రమం ఆదివారం పోరంకి మురళి రిసార్ట్స్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, బాపట్ల ఎంపీ తెన్నేటీ కృష్ణ ప్రసాద్, పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), బోడే ప్రసాద్, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాబి రామ్, ఎపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ స్టేట్ బిల్డింగ్ వర్కర్స్ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఇక ప్రత్యేక అతిథులుగా హీరోయిన్స్ సంయుక్త మీనన్, దివి వద్యా, మానస వర్షిణి పాల్గొనగా, కిష్కందపురి మూవీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, హీరోయిన్ అనుమప పరమేశ్వరన్ సందడి చేశారు.

ముందుగా ఎంపీ కేశినేని శివనాథ్ జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మధుమిత అండ్ డాన్స్ టీమ్ అమ్మవారి రూపాలతో చేసిన నృత్య కళా రూపకంతో పాటు ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణయ్య కృష్ణుడి వేషధారణలో శ్రీ కృష్ణుడి రాయబార ఘట్టంలోని కొన్ని పద్యాలని ఆలపించిన తీరు ఆహుతులని ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే ఈ సభ నిర్వహణ ఆద్యంతం వ్యాఖ్యతగా స్వఛ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ముందుండి నడిపించారు.

**విజయవాడ ఉత్సవ్ లోగో అండ్ ఎవి లాంచ్**

ఈ కార్యక్రమంలో ముందుగా సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ పేరుతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ లాంచింగ్‌కి సంబంధించిన ఎ.వి వీడియోను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), బోడే ప్రసాద్, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాబి రామ్, ఎపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఎపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ స్టేట్ బిల్డింగ్ వర్కర్స్ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ,టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న , సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ తరుపున ముత్తవరపు మురళీకృష్ణ, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎస్.ఎల్.వి శ్రీనివాస రాజు, ప్రకాష్, సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే విజయవాడ ఉత్సవ్ లోగో ఆవిష్కరణను ప్రముఖ నటి సంయుక్త మీనన్, మిస్ ఇండియా మనసా వరణాసి, నటి దివి వద్యా ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ చలసాని అజేయ్ కుమార్. హైకోర్ట్ సీనియర్ లాయర్ పోసాని వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసార్, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట సంజీవని

**●బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**



వేమూరు (చైతన్యరథం): సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట సంజీవనిగా మారిందని నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. భట్టిప్రోలు మండలం, దాసరిపాలెం గ్రామానికి చెందిన చెగోడి మల్లేశ్వరి అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) చికిత్స కోసం బిల్‌ని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపించారు. తదుపరి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సీఎంఆర్ఎఫ్ రూపంలో రూ.3,50,000 మంజూరు చేశారు. మంజూరైన మొత్తాన్ని చెగోడి మల్లేశ్వరి కుటుంబ సభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు రూపంలో అందజేశారు.

# స్త్రీ శక్తి సభకు సర్వం సిద్ధం : ఎమ్మెల్యే గళ్ళా

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నేడు సెప్టెంబర్ 8 (సోమవారం) సాయంత్రం 5 గంటలకు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో "సూపర్ సిక్స్ - సూపర్ హిట్ - స్త్రీ శక్తి" సభను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా కార్యకర్తలు, అభిమానులు, మహిళా శక్తి ఊరేగింపుగా సభా ప్రాంగణానికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం పసుపు, జనసేన, కాషాయ పతాకాలతో అలరారనుంది. రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రముఖ ప్రజాప్రతినిధులు సభలో పాల్గొననున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మహిళా సాధికారత గురించి ఈ సభలో నేతలు ప్రసంగించనున్నారు. ఈ సభను ఘనవిజయం చేయాలని పిలుపునిచ్చారు.

# గన్నవరంలో యూరియా కొరత లేదు : యార్లగడ్డ

గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గంలో ఎరువుల కొరత ఉందంటూ మీడియాలో వస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని నియోజకవర్గంలో ఎరువులు కొరత లేదని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గంలోని పురుషోత్తపట్నం గ్రామంలో యూరియా కోసం రైతులు పిఏసిఎస్ వద్ద ఎదురుచూస్తున్నారంటూ ఓ ఛానల్ లో స్క్రోలింగ్ రాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి తీసుకువెళ్ళి సమస్యను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా పర్యటనకు సిద్ధమైన కలెక్టర్ ఎమ్మెల్యే సూచనల మేరకు గన్నవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎరువుల వినియోగం, సరఫరా పై రైతుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొని అధికారులతో మాట్లాడారు. రైతుల అవసరాలు మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎరువుల సరఫరా పై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఎరువులు కోసం రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

# ఇబ్రహీంకు ముస్లిం యువతరం అభినందనలు



మంగళగిరి (చైతన్యరథం): పాత బస్టాండ్ సెంటర్ గుడ్‌విల్ ముస్లిం సంక్షేమ కార్యాలయం వద్ద అమెరికాలో ఉంటున్న ముస్లిం యువతరం కన్వీనర్ హాజీ ఎండీ ఇక్బాల్ అహ్మద్ ఆదేశాల మేరకు ఆదివారం ఇటీవల రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితమైన మహమ్మద్ ఇబ్రహీంను యువతరం నాయకులు కలిసి అభినందించారు. ఇబ్రహీం చే నాయకులు కేక్‌కట్ చేయించి ఆయన్ని శాలువాలతో సత్కరించి, బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. నాడు ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడిగా ఉండి, ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీ పిలుపుతో పార్టీలో చేరి, పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఇబ్రహీంకు డైరెక్టర్ పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ముస్లింలకు నామినేట్ పదవులలో రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చి, ముస్లింలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువతరం అధ్యక్ష కార్యదర్శులు అక్బర్ ఆలీ, అన్వర్, న్యాయవాది సౌకత్, యువతరం నాయకులు గల్ఫ్ సుభాని, భాషిత్, షేక్ జానీ, రషీద్, రఫీ, ఖాదరి, జిలాని, అన్వర్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, టీడీపీ నాయకులు జమ్ముల శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయి, ఇస్మాయిల్, ఎండీ రఫీ అండ్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పరిటాల స్వగ్రామం వెంకటాపురంలో మంత్రులు, ఎమ్మెల్యేల సందడి

●పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

●సూపర్ సిక్స్ - సూపర్ హిట్ బహిరంగ సభ విజయవంతంపై సమీక్ష



రాప్తాడు (చైతన్యరథం): రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ రాష్ట్ర నాయకులు రాకతో పరిటాల స్వగ్రామం రామగిరి మండలం వెంకటాపురంలో సందడి వాతావరణం కనిపించింది. సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ కోసం జిల్లాకు వచ్చిన మంత్రులు.. ఆదివారం వెంకటాపురంలో పర్యటించారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖా మంత్రి మండ్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఉగ్ర నరసింహారెడ్డి, ఆనంద్‌రావు, రాష్ట్ర మారీ టైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో పలువురు రాష్ట్ర నాయకులు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్చార్జి శ్రీరామ్ ఆహ్వానం మేరకు వెంకటాపురం వచ్చారు. ముందుగా వారు పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను పరిశీలించారు. అనంతరం పరిటాల సునీత, శ్రీరామ్‌తో కలిసి మహాలయ పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత అనంతపురం జిల్లా కేంద్రంలో ఈ నెల 10 న జరగనున్న "సూపర్ సిక్స్ – సూపర్ హిట్" భారీ బహిరంగ సభ విజయవంతం చేయడం గురించి సమీక్షించడంతో పాటు జిల్లా రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించుకున్నారు. పరిటాల రవితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో ఆయన చేసిన రాజకీయం రాష్ట్రంలో ఎంతో మందికి ధైర్యాన్ని ఇచ్చిందని సీనియర్ నాయకులు అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు రావడంతో వెంకటాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి నాయకులు తరలివచ్చి మంత్రులు ఎమ్మెల్యేలను కలిశారు.

# రాయలసీమను రత్నాలసీమగా మార్చడమే ఎన్టీఆర్ సంకల్పం : దేవినేని ఉమా

●చంద్రబాబు దూరదృష్టితో రాయలసీమ నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం



రాయదుర్గం (చైతన్యరథం): అనంతపురం జిల్లా, గుమ్మగట్ట మండలంలోని భైరవాని తిప్ప ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, రైతు కమిషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రాయలసీమ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కట్టుబడి ఉందని నాయకులు పునరుద్ఘాటించారు.

**ఎన్టీఆర్ సంకల్పం - చంద్రబాబు సాకారం**

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... రాయలసీమను రత్నాలసీమగా మార్చాలన్న టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) సంకల్పాన్ని గుర్తు చేశారు. 1985లో హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమను మార్చే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని, తెలుగు గంగా, హంద్రీనీవా, గాలేరు నగరి పథకాలకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి చేసి కుప్పంకు నీటిని అందించారని, త్వరలో కృష్ణా జలాలను భైరవాని తిప్ప ప్రాజెక్టుకు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు దూరదృష్టితో నదుల అనుసంధానం ద్వారా గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు, కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి తీసుకొచ్చే వెసులుబాటు కలిగిందని దేవినేని ఉమా వివరించారు. గోదావరి నీటిని రాయలసీమకు అందించాలన్నది చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు.

**వైసీపీ పాలనలో గ్రహణం - చంద్రబాబుతో చంద్రోదయం**

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో భైరవాని తిప్ప ప్రాజెక్టు గ్రహణం ఎదుర్కొందని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో చంద్రోదయం రావడంతో అభివృద్ధి పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. మృత నదిగా మారిన వేదవతి హగ్రీ నదికి కొత్త జీవం పోసేందుకు దేవినేని ఉమామహేశ్వర రావు ఆనాడు మంత్రిగా సహకరించారని కొనియాడారు.

# ఉల్లికి ఉల్లగడ్డకు తేడా తెలియని జగన్ : మంత్రి సవిత

●యూరియా గురించి జగన్ తప్పుడు ప్రచారం

●ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో వచ్చి చర్చించాలి




సోమందేపల్లి (చైతన్యరథం): రాష్ట్రాన్ని అధోగతి పాలు పట్టించి నేడు శ్రీరంగ నీతులు చెబుతున్నాడు జగన్ అంటు మండి పడ్డారు మంత్రి మంత్రి సవిత. శ్రీ సత్యసాయిజిల్లా సోమందేపల్లి తేదేపా కార్యాలయంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంపై కూటమి నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా పెనుకొండ నియోజకవర్గ పరిశీలకులు ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు, నరసింగరావు, రాష్ట్ర మార్క్ ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజుతో కలిసి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ... తన తండ్రి శవం ప్రక్కన కుర్చోని సంతకాలు పెట్టించుకున్న ఘనత రంగులరెడ్డి జగన్‌ది అని, నాడు బాబాయ్ గొడ్డలి పోటుని గుండెపోటుగా చెప్పిన ఘనత ఈ జగన్ ది అన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు యూరియా, డీఏపీ పుష్కలంగా అందిస్తుంటే దానిని యూరియా లేదు అంటు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. రైతులను అయోమయానికి గురి చేసి ప్రజలను మోసం చేస్తే వైసీపీ శ్రేణులను వదిలే సమస్యే లేదన్నారు. జగన్‌కు నిజంగా ప్రజల గురించి మాట్లాడాలనిపిస్తే ఈ నెల 18 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని, రాష్ట్రం లేదా కనీసం నీ పులివెందుల గురించి మాట్లడటానికైనా దమ్ముంటే అసెంబ్లీకి రావాలని, నీకు సుదీర్ఘంగా మాట్లాడేందుకు మైకు ఇస్తామని, నీలాగ మేము మీ తల్లి గురించి, మీ భార్య గురించి అనుచితంగా మాట్లాడం అన్నారు, ఉల్లికి, ఉల్లగడ్డకు తేడా తెలియని నీవు కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని, పెన్షన్ దారులకు అందిస్తున్న 4000 వేల పెన్షన్‌ను ప్రపంచం అంతా చూస్తోందని, భారతదేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలు చంద్రబాబునాయుడు అమలు చేస్తు అందరి నోటా ఔరా అనిపించుకుంటున్నారని, ఈ నెల 10న అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు 164 మంది ఎమ్మెల్యేలు వస్తున్నారని, ఈ సభ విజయవంతం చేసి వైసిపికి బుద్ధి చెప్పి, రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వంపై మరింత నమ్మకం కలిగేలా చేద్దామని చంద్రబాబు చేపడుతున్న చర్యలను సభలో విపులంగా వెల్లడించనున్నట్లు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గం నుండి భారీగా ప్రజలు సభకు తరలివెళ్లేలా ప్రతీ ఒక్కరు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు, సభ విజయానికి తమ వంతు కృషి చేయాలని తెలిపారు.

# వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి ముగింపు పలుకుదాం

●సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభను విజయవంతం చేద్దాం

●మంత్రి గొట్టిపాటి, పరిటాల శ్రీరామ్, ఆనందరావు పిలుపు

●చేసిన మంచిని కూడా వైసిపి చెడుగా ప్రచారం చేస్తోంది



ధర్మవరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ ద్వారానే సమాధానం చెబుదామని ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు, టిడిపి నాయకులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ఈనెల 10న అనంతపురంలో జరగబోయే విజయోత్సవ సభకు సంబంధించి... ధర్మవరం టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, జనసేన నాయకుడు మధుసూదన్ రెడ్డితో పాటు ధర్మవరం నియోజకవర్గానికి చెందిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పదేళ్ల వెనక్కు వెళ్లిందని.. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఓవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ఎవరు ఊహించని విధంగా 14 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేశారన్నారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన పథకాలు అమలు చేసి మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఎక్కడ గుంతల రోడ్లు లేకుండా చేశారన్నారు. కానీ ఇలాంటి మంచిని కూడా వైసిపి నాయకులు చెడుగా ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని మనం సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సూపర్ హిట్ సభను విజయవంతం చేయడం ద్వారా ఒక మెసేజ్ ఇచ్చినట్టు అవుతుందన్నారు. అలాగే అక్కడ మనం పథకాలు ఏ విధంగా అమలు చేస్తున్నామో నాయకులు చెప్పే మాటలను ప్రతి ఒక్కరికి వెళ్లి వివరించే ప్రయత్నం చేయాలని పరిటాల శ్రీరామ్ సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం పార్టీ నాయకులు మూడు రోజులు పాటు కష్టపడాలని సూచించారు. మరోవైపు మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ పరిటాల రవితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ సందర్భంగా వెంకటాపురం వెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీరామ్ నాయకత్వంలో ఇక్కడ పార్టీ ఎంత బలంగా ఉందో అర్థమవుతోందన్నారు. ఇక్కడ ప్రతి నాయకుడు, కార్యకర్త ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామస్థాయిలోకి వెళ్లి జన సమీకరణ చేయాలని సూచించారు. మనం చేసిన మంచి గురించి ప్రజలకు చెప్పే అవకాశం ఇప్పుడు మనకు లభించిందన్నారు. సంక్షేమ పథకాల విషయంలో అందరూ సంతోషంగా ఉన్నారని ఈ నేపథ్యంలో ఈ సభను విజయవంతం చేసేందుకు కూడా ప్రజలు ముందుకొస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఏ విధంగా అధ్వానంగా మారిందో అందరికీ తెలుసునన్నారు. ఇలాంటి పరిస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడమే కాకుండా చెప్పిన మాట ప్రకారం అన్ని పథకాలు అమలు చేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని ప్రజల అభిప్రాయం అని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో డబ్బులు ఉండి పథకాలు అమలు చేయడం లేదని.. చంద్రబాబు నాయుడు సమర్థత వల్లే పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేసే విధంగా సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరొకసారి వైసిపి నాయకులకు అవకాశం ఇవ్వకుండా వారు చేసే దుష్ప్రచారాలకు తెరదించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఇందు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు ముందుకు రావాలన్నారు. అనంతపురం జిల్లాలో 14 స్థానాలకు 14 గెలిచారని అందుకే ఈ జిల్లా నుంచి రాష్ట్ర ప్రజలకు సందేశం ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

# సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై నేతల ప్రత్యేక సమావేశం

పుట్టపర్తి (చైతన్యరథం): ఈ నెల 10వ తేదిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నివాసంలో "సూపర్ సిక్స్ సూపర్ హిట్ "విజయోత్సవ సభ నిర్వహణపై రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్, మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఏలూరు సాంబశివరావు, ఉగ్రనరసింహారెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, సూర్య ప్రకాష్, రాయల్ మురళి, వెంకటప్ప తదితరులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల అనంతరం చేపడుతున్న సభను విజయవంతం చేయాలి నేతలు ఆకాంక్షించారు.



# బీజేపీ ఎంపీల వర్క్ షాప్..

**- ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు**

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనుంది. ఆ క్రమంలో భారతీయ జనతా పార్టీ.. తన ఎంపీలతో రెండు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహిస్తోంది. ఈ వర్క్ షాప్ ఆదివారం న్యూఢిల్లీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ వర్క్ షాప్‌లో ప్రధాని నరేంద్ర మోదీ.. ఇతర సభ్యులతో కలిసి చివరి వరుసలో కూర్చున్నారు. అందుకు సంబంధించిన ఫొటో వైరల్ అవుతోంది. ఈ వర్క్ షాప్ ప్రారంభం కాగానే.. జీఎస్టీలో సంస్కరణలు తీసుకు వచ్చిన ప్రధాని మోదీని సభ్యులు ప్రశంసలతో ముంచెత్తారు. ఇక తొలిరోజు ఈ వర్క్ షాప్‌లో 2027 నాటికి అభివృద్ధి దిశగా భారత్.., సోషల్ మీడియాను ఎంపీలు సమర్థవంతంగా వినియోగించడం.. ఈ రెండు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. అలాగే వ్యవసాయం, రక్షణ, ఇంధ నం, విద్య, రైల్వేలు తదితర కమిటీలతో ఈ ఎంపీలు సమావేశం కానున్నారు. ఇక రెండో రోజు సోమవారం.. అంటే సెప్టెంబర్ 8వ తేదీన జరిగే వర్క్ షాప్‌లో ఉప రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి ఎంపీలకు శిక్షణ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఈ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక తేదీని ఖరారు చేసింది. దాంతో ఎన్డీయే నుంచి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరు ఖరారు చేసింది. ఇక ప్రతిపక్షం ఇండియా కూటమిలోని పార్టీలు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు దక్షిణ భారతదేశానికి చెందిన వారే కావడం గమనార్హం. సీపీ రాధాకృష్ణన్ తమిళనాడు, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు. అయితే ఈ ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ విజయం సాధిస్తారంటూ ఇప్పటికే ఒక చర్చ అయితే బలంగా సాగుతోంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీల సంఖ్య అధికంగా ఉండడమే అందుకు కారణం. ఇక సెప్టెంబర్ 8వ తేదీన జరిగే ఈ ఎన్నికల్లో ఎలక్టోరల్ కాలేజీలోని మొత్తం 786 సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

# దుబాయ్ కేంద్రంగా పవన్ ఠాకూర్ దందా

**- రూ.2500 కోట్ల డ్రగ్స్ రాకెట్ సూత్రధారి..**

**- హై ప్రొఫైల్ లింకులు బహిర్గతం..**



దేశవ్యాప్తంగా భారీ డ్రగ్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న ముఠా లింకులకు సంబంధించిన కీలక వివరాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో దర్యాప్తులో గుర్తించింది. దుబాయ్ కేంద్రంగా డ్రగ్స్ దందా సాగిస్తున్న పవన్ ఠాకూర్ అనే వ్యక్తిని ప్రధాన సూత్రధారిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిందితుడు ఖరీదైన కార్లు, విల్లాలు కలిగి ఉన్నాడని.. విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడని ఎన్‌సిబి దర్యాప్తులో తేలింది. ఈ మేరకు అతడిపై ఇంటర్నేషనల్ సిల్వర్ నోటీస్ కూడా జారీ చేసినట్లు సమాచారం. 2024 నవంబర్‌లో ఢిల్లీలో దాదాపు రూ.2,500 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడింది. ఏకంగా 82 కిలోల హై-గ్రేడ్ కొకైన్ స్మగ్లింగ్ చేస్తూ నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. దేశంలోనే ఈ స్థాయిలో మాదకద్రవ్యాల పట్టివేత జరగడం ఇదే తొలిసారి. ఈ కేసులో పవన్ ఠాకూర్ అనే నిందితుడు ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తెలిపిన వివరాల ప్రకారం, సరుకును ట్రక్కులో దేశ రాజధానికి తరలించిన తర్వాత పంపిణీ కోసం గిడ్డంగిలో నిల్వ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పవన్ ఠాకూర్ దుబాయ్ కేంద్రంగా డ్రగ్స్ దందాను నడిపిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నిందితుడ్ని పట్టుకునేందుకు ఎన్‌సిబి అధికారులు ఇంటర్నేషనల్ సిల్వర్ నోటీస్ జారీ చేశారు.

***నల్ల ధనం హవాలా మార్గంలో...***

దర్యాప్తు అధికారులు తెలిపిన ప్రకారం మొదట ఢిల్లీలో హవాలా ఏజెంట్‌గా ప్రస్థానం మొదలుపెట్టి క్రమంగా పెద్దఎత్తు న మాదకద్రవ్యాల అక్రమ రవాణాలోకి దిగాడు. ఇతడు భారత దేశం, దుబాయ్‌లలో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నాడు. మాదక ద్రవ్యాల సరఫరా ద్వారా వచ్చే నల్లధనాన్ని హవాలా మార్గం ద్వారా మళ్లిస్తుంటాడు. భారతదేశం, చైనా, సింగపూర్, హాంకాంగ్, యూఏఈలలో క్రిప్టో కరెన్సీ ద్వారా నిందితుడు చేసి లావాదేవీలు, క్రాస్-బోర్డర్ షెల్ కంపెనీల ద్వారా చేసిన కార్యక లాపాలకు సంబంధించిన ఆధారాలు సేకరించినట్లు అధికారు లు పేర్కొన్నారు. ఇతడికి ఇప్పటికే పలుమార్లు ఈడీ సమన్లు జారీ చేసినప్పటికీ అధికారుల ముందు హాజరుకాలేదు. దీంతో ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు పవన్ ఠాకూర్‌పై నాన్-బెయిల బుల్ వారెంట్ జారీ చేసింది. ఇక, 2024 నవంబరులో ఢిల్లీలో కొకైన్ స్వాధీనం చేసుకున్న కొద్దికాలానికే పవన్ కుటుం బంతో సహా ఇండియా నుంచి పారిపోయి దుబాయ్‌లో స్థిరపడ్డా డు. అక్కడ నుంచే స్మగ్లింగ్, మనీలాండరింగ్ నెట్‌వర్క్‌ను నిర్వ హిస్తున్నట్లు సమాచారం.

### ప్రజ్వల్ రేవణ్ణకు జైలులో పని..

# ఒకరోజు వేతనం ఎంతంటే



బెంగళూరు: అత్యాచారం కేసులో జీవిత ఖైదు పడి ప్రస్తుతం పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఉన్న హసన్ నియోజకవర్గం మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు అక్కడ లైబ్రరీ క్లర్క్ పనులు అప్పగించారు. జైలు నిబంధనల ప్రకారం యావజ్జీవ శిక్ష పడిన ఖైదీలకు లేబర్ ప్రోగ్రాం అప్పగించడం తప్పనిసరి. లైబ్రరీ క్లర్క్‌గా ఖైదీలకు బుక్స్ ఇవ్వడం, రికార్డులు మెయింటెన్ చేయడం వంటి పనులు ప్రజ్వల్ చేయాల్సి ఉంటుంది. నిర్వహణాపరమైన పనుల పట్ల తనకు ఆసక్తి ఉందని ప్రజ్వల్ చెప్పడంతో ఆయనకు లైబ్రరీ పనులు అప్పగించినట్లు జైలు అధికారులు తెలిపారు. పుస్తకాల పట్టిక తయారు చేయడం, వాటిని ఖైదీలకు ఇవ్వడం, బుక్స్‌ను ట్రాక్ చేయడం వంటివి ఆయన చేయాల్సి ఉంటుంది. రోజు వేతనంగా రూ.522 ఇస్తారు. రేవణ్ణ ఇప్పటికే ఒకరోజు డ్యూటీ పూర్తి చేసినట్టు జైలు అధికారి ఒకరు చెప్పారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనుమడు, జేడీఎస్ సీనియర్ నేత హెచ్ రేవణ్ణ కుమారుడైన ప్రజ్వల్ రేవణ్ణపై పలు అత్యాచార, లైంగిక దాడుల కేసులు ఉన్నాయి. ఒక అత్యాచారం కేసులో ఆయనను ప్రత్యేక కోర్టు 2025 మేలో దోషిగా ప్రకటించింది. 2024లో ఆయనపై వచ్చిన పలు వీడియోలు సంచలనం కావడంతో 'సిట్' దర్యాప్తు జరిపింది. డిజిటల్, టెస్టిమోనియల్ సాక్ష్యాలను సేకరించింది. ప్రజ్వల్ అరెస్టు కావడానికి ముందు నెల రోజుల పాటు పరారీలో ఉన్నారు.

# నోట్లో యాసిడ్ పోస్తా..

## బీజేపీ నేతపై రెచ్చిపోయిన టీఎంసీ ఎమ్మెల్యే



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అబ్దుర్ రహీమ్ బక్షి మరోసారి రెచ్చిపోయారు. బీజేపీ సిలిగురి శాసనసభ్యుడు శంకర్ ఘోష్‌ను లక్ష్యంగా చేసుకుని 'నోట్లో యాసి డ్ పోస్తా' అంటూ బెదిరించారు. ఆయన వ్యాఖ్యలు బెంగాల్ రాజకీయాల్లో ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. బెంగాల్ మాట్లా డే వలస కార్మికులపై ఇతర రాష్ట్రాలలో దాడులు జరుగుతున్నా యంటూ శనివారంనాడు మాల్దాలో టీఎంసీ నిరసన ర్యాలీ జరిపిం ది. ఇందులో బక్షి ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ వలస కార్మికులను రోహింగ్యాలు, బంగ్లాదేశీయులుగా గతంలో మాట్లాడిన బీజేపీ నేతలపై బక్షి విరుచుకుపడ్డారు. శంకర్ ఘోష్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే.. 'మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు విన్నానంటే నీ నోట్లో యాసిడ్ పోసి గొంతును కాల్చేస్తా. నీకు తెలుసు, ఇది బెంగాల్. బెంగాలీలుగా నిన్ను మాట్లాడేందుకు మేము అనుమతించేది లేదు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ జెండాలు చించివేయాలని, పార్టీని సామాజిక బహిష్కరణ చేయాల ని తన మద్దతుదారులను కోరారు. హింసాత్మక బెదిరింపులకు పాల్పడడం బక్షికి కొత్త కాదు. గతంలో ఆయన బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తల కాళ్లు, చేతులు నరికేస్తామంటూ హెచ్చరికలు చేశారు.

**మండిపడిన బీజేపీ**

బక్షి వ్యాఖ్యలపై శంకర్ ఘోష్ ఘాటుగా స్పందించారు. 'ఆయన ఎమ్మెల్యే కాదు, మారువేషంలో ఉన్న క్రిమినల్. రాష్ట్రాన్ని మమత బెనర్జీ ఏవిధంగా నడుతున్నారో ఆయన వ్యాఖ్యలే చెబుతు న్నాయి. విపక్షాలపై యాసిడ్ దాడులు జరుపుతామని బెదిరిస్తూ పాలన సాగిస్తున్నారు' అని అన్నారు. బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము మాట్లాడుతూ, హింసాత్మక సంస్కృతిని టీఎంసీ వ్యాప్తి చేస్తోందని, రాజకీయ నిరాశలో కూరుకుపోయినందునే బక్షి ఇలాంటి వ్యాఖ్య లు చేస్తున్నారని తప్పుపట్టారు. బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో టీఎంసీపై విమర్శలు గుప్పించారు. హింస అనేది టీఎంసీకి కొత్త కాదని, అది వారి రాజకీయ సంస్కృతి అని, ముఖ్యంగా మాల్దా-ముర్షీదాబాద్‌లో ఉండే అక్రమ బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు మమతాబెనర్జీ ఓటు బ్యాంకు అని వ్యాఖ్యానించారు.

### రైతుల పరామర్శకు

# రేపు పంజాబ్‌లో మోదీ పర్యటన

న్యూఢిల్లీ: పంజాబ్‌లో గత ఏథై ఏళ్లలో కనీవినీ ఎరుగని విధం గా వరదలు బీభత్సం సృష్టించడం, పెద్దఎత్తున ఆస్తి, పంటనష్టం సంభవించడం, లెక్కకు మిక్కిలిగా నిరాశ్రయులు కావడంతో ఆ రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. సహాయ, పునరావాస కార్యక్రమాలు, అక్కడి పరిస్థితిని సమీక్షించే దుకు సెప్టెంబర్ 9న ఆయన పంజాబ్‌లో పర్యటిం చనున్నట్టు బీజేపీ పంజాబ్ విభాగం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపిం ది. గురుదాస్‌పూర్‌లో ప్రధాని పర్యటించి వరద బాధిత ప్రజలు, రైతులను కలుసుకుంటారని పేర్కొంది. బాధితులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటారని వివరించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పంజాబ్ ప్రజలకు అం డగా నిలుస్తుందని, కష్టకాలంలో పూర్తి సహకారాన్ని అందిస్తుం దని, ఇందుకు ప్రధాని పంజాబ్‌లో పర్యటించనుండటమే నిదర్శ నమని బీజేపీ పంజాబ్ యూనిట్ తెలిపింది.

# హనీమూన్ మర్డర్ కేసు..


**- భర్త హత్యకు సోనమ్ ఎలా ప్లాన్ చేసింది?**

**- ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే నిజాలు..**



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో అసలు నిందితులు ఎవరో వెల్లడైంది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన రాజారఘువంశీ కేసులో మేఘాలయ పోలీసుల సిట్ దర్యాప్తు పూర్తయింది. భర్త రాజా రఘువంశీని హత్య చేసేందుకు సోనమ్ ఎలా ప్లాన్ చేసింది? హత్యకు పాల్పడ్డ నిందితులు ఎవరు? తదితర పూర్తి వివరాలతో కూడిన 790 పేజీల ఛార్జ్‌షీట్‌ను పోలీసులు షిల్లాంగ్ కోర్టులో దాఖలు చేశా రు. రాజా రఘువంశీ భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహాతో పాటు మరో ముగ్గురిని ఛార్జ్‌షీట్‌లో నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఇండోర్ వ్యాపారవేత్త రాజా రఘువంశీ హత్య కేసులో మేఘాలయ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం సుదీర్ఘ దర్యాప్తు అనంతరం కోర్టులో 790 పేజీల ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దర్యాప్తులో పోలీసులు కాల్ రికార్డులు, లొకేషన్ డేటా, సాక్షుల వాంగ్మూలాలతో సహా అనేక ఆధారాలను సేకరించారు. వీటితో పాటు ఫోరెన్సిక్ నివేదికలను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజా భార్య సోనమ్ రఘువంశీ, ఆమె ప్రేమికుడు రాజ్ కుష్వాహ ఈ హత్య కేసులో ప్రధాన సూత్రధారులుగా ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. కుట్ర అమలుకు సహకరించిన ఆకాష్ రాజ్‌పుత్, ఆనంద్ కుర్మి, విశాల్ సింగ్ చౌహాన్ అనే మరో ముగ్గురు నిందితులపై అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ ఐదుగురిపై భారత శిక్షాస్మృతి ప్రకారం హత్య, సాక్ష్యాలను నాశనం చేయడం, నేరపూరిత కుట్ర అనే ఆరోపణల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. రాజా హత్య తర్వాత సోనమ్ దాక్కున్న ఇంటి యజమాని లోకేంద్ర తోమర్, సెక్యూరిటీ గార్డు బల్బీర్ అహిర్వర్, జేమ్స్ అనే వ్యక్తులను పోలీ సులు ఈ కేసులో సహనిందితులుగా చేర్చారు. జూన్ 11న నిందితులను కోర్టు కస్టడీకి అప్పగించింది.

# కరేబియన్ సీపై యుద్ధమేఘాలు!



**- వెనుజువెలా ఆక్రమణకు అమెరికా మోహరింపు?**

**- డ్రగ్స్ సాకు.. అపార చమురుపై ఆశలు - యూఎస్ సైనిక శక్తిని వెనుజువెలా ఎదుర్కోగలదా?**

ఏడు యుద్ధాలను ఆపిన తాను నోబెల్ శాంతి బహుమతికి అర్హుడినంటూ పదేపదే చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరలేపనున్నారు. కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్ జెట్ల మోహరింపు చూస్తుంటే.. ఏ క్షణమైనా వెనుజువెలాలోకి అమెరికా సేనలు చొరబడే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న దేశంచుట్టూ ఇవి సమయం కోసం ఎదురు చూస్తూ కాచుకు కూర్చొన్నాయి. ఒకవిధంగా కరేబియన్ జలాలపై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయనే చెప్పాలి. వెనుజువెలా ముఠాలనుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటినుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకూ సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయనను పట్టించే సమాచారమిస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.430 కోట్లు) బహుమతి ప్రకటించింది. ఇటీవలే మదురో సర్కారు ఇక రోజులు లెక్క పెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడంలేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు. దీంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే డ్రగ్స్ బోటంటూ ఓ పడవను అమెరికా దళాలు ముంచేశాయి. దీంతో 11మంది మరణించారు. అమెరికా మోహరింపులను మదురో తప్పుపట్టారు. గత వందేళ్లలో తమ దేశం ఎదుర్కొన్న అతి పెద్ద ముప్పుగా దానిని వర్ణించారు. 8 నౌకల్లో 1200 క్షిపణులను తమపై గురిపెట్టారని ఆరోపించారు..

**చమురుపై ఆశలు కాదా?**

వెనుజువెలా నుంచి మాదకద్రవ్యాల ముఠాలు పనిచేస్తున్నాయన్న ట్రంప్ ఆరోపణలు వాస్తవమే. దళాలకు దొరికినప్పుడు సముద్రంలో పారబోసే కొకైన్ దెబ్బకు అక్కడి షార్క్ చేపల్లో కూడా దాని ఆనవాళ్లుంటున్నాయంటే అక్రమ రవాణస్థాయిని అర్థం చేసుకోవచ్చు. కానీ, డ్రగ్స్‌ను సముద్రంలో పట్టుకొని.. నిందితులను అరెస్టు చేయడానికి ఇంత భారీ సంఖ్యలో యుద్ధనౌకలు, ఫైటర్‌జెట్లు అవసరమా? అన్నదే సందేహాస్పదం. వాస్తవానికి ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు వెనుజువెలాలో ఉన్నట్టు నిర్ధరణ అయింది. స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ వరల్డ్ ఎనర్జీ లెక్కల ప్రకారం 2021నాటికి ఈ దేశంలో 48 వేల మిలియన్ టన్నుల చమురును గుర్తించారు. ఇవి సౌదీలో నిల్వలకంటే అధికం. ప్రపంచ చమురులో 17శాతానికి సమానం. కానీ, ప్రపంచ చమురు వ్యాపారంలో ఈ దేశం వాటా కేవలం 0.8శాతమే. అమెరికా అక్కడి ప్రభుత్వ రంగ కంపెనీ పెట్రోలియస్ డె వెనుజువెలా ఎస్ఏపై ఆంక్షలు విధించడమే దీనికి కారణం. అగ్రరాజ్యంతోపాటు కెనడా, ఐరోపా సమాఖ్య తదితర దేశాలు కలిసి 350 ఆంక్షలు విధించాయి.

**ఎప్పటి నుంచో ట్రంప్ కన్ను..**

ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 'వెనుజువెలాలో చమురు రిజర్వులను అమెరికా స్వాధీనం చేసుకోవాలి' అని అన్నారు. 2017లో ఓ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుజువెలాపై ఎందుకు యుద్ధం చేయడంలేదని ప్రశ్నించారు. "వాళ్లవద్ద చాలా చమురు ఉంది. భౌగోళికంగా మనకు చాలా దగ్గర" అని వ్యాఖ్యానించారు. గతంలో కూడా మదురో సర్కారును కూల్చేందుకు ట్రంప్ ప్రయత్నించారు. 2023లో ఉత్తరకరోలినా రిపబ్లికన్ పార్టీ సభలో ప్రసంగిస్తూ "నేను గతంలో పదవిని వీడే సమయానికి వెనుజువెలా కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. మేము దానిని ఆక్రమించుకొనే వాళ్లం. దాని చమురు మొత్తాన్ని తీసుకొనే వాళ్లం. ఇప్పుడు దానినుంచే చమురు కొంటున్నాం" అని పేర్కొన్నారు. ట్రంప్ మనసులో ఈ ఆలోచన ఎప్పటి నుంచో ఉందనడానికి ఇదే నిదర్శనంగా నిలిచింది. అప్పట్లో అమెరికా ఎన్ఎస్ఏ హెచ్ఆర్ మెక్ మాస్టర్ సహా పలువురు మంత్రులు ట్రంప్ ఆలోచనను వ్యతిరేకించారు.

**భారీగా చైనా పెట్టుబడులు..!**

మరోవైపు చైనా మాత్రం అమెరికా ఆంక్షలకు భయపడకుండా వెనుజువెలాలో 212 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టింది. ఆ దేశం ఉత్పత్తిచేసే చమురులో 90 శాతం బీజింగ్ కొనుగోలు చేస్తోంది. చమురు క్షేత్రాల అభివృద్ధికి 2026లో మరో బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. 2007నుంచి చమురుకు రుణ ఒప్పందాలు చేసుకొని.. 50 బిలియన్ డాలర్లు ఇచ్చింది. భారత్ ఈ దేశం నుంచి కొన్నేళ్లు చమురుకొన్నా.. ఆంక్షలకు భయపడి బాగా తగ్గించేసింది.

**అమెరికా సైనిక శక్తిని ఎదుర్కోగలదా..?**

అమెరికాతో పోలిస్తే వెనుజువెలా సైన్యం చాలా చిన్నది. 1,23,000 మంది సైనికులు, 8,000 మంది రిజర్విస్టులు, 2,20,000 మంది పౌరసైన్యం ఉంది. అమెరికాతో 80లక్షల మంది పౌరులను సిద్ధం చేస్తానంటూ మదురో ఇటీవలే ప్రకటించారు. కానీ, ఇది సాధ్యమయ్యేపనికాదు. సుఖోయ్-30, 1980లనాటి ఎఫ్-16, ఇరాన్ డ్రోన్లు ఉన్నాయి. మొత్తం 229 యుద్ధ విమానాలున్నాయి. ప్రపంచంలో అత్యధిక ఆయుధ సంపద కలిగిన అమెరికావద్ద వివిధ రకాల 13,000 విమానాలున్నాయి. చైనా, రష్యాతో సన్నిహిత సంబంధాలున్నా.. భౌగోళికంగా దూరంగా ఉండటంతో అవి ఎంతవరకు వెనుజువెలాను ఆదుకుంటాయో చెప్పలేని పరిస్థితి.

# మళ్లీ మంటబెట్టిన రష్యా

## 800 డ్రోన్లతో ఉక్రెయిన్‌పై అతి పెద్ద దాడి



ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకంగా 800కు పైగా డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. యుద్ధం మొదలు ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే మొదటిసారి. అదేవిధంగా తొలిసారి ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్ ప్రతినిధి యూరీ ఇన్హాత్ దాడులను ధ్రువీకరించారు. ప్రత్యర్థి దేశం 13 క్షిపణులూ ప్రయోగించిందన్నారు. 747 డ్రోన్లు, నాలుగు క్షిపణులను నేలకూల్చినట్టు చెప్పారు. 54 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు కీవ్ సహా దేశవ్యాప్తంగా 37 ప్రాంతాలను తాకినట్టు వెల్లడించారు. ఈ దాడుల్లో ఓ చిన్నారి సహా ముగ్గురు మృతి చెందారు. పదుల సంఖ్యలో పౌరులు గాయపడ్డారు. రష్యా దాడుల్లో కీవ్‌లోని మంత్రుల భవనం పాక్షికంగా ధ్వంసమైంది. ఇందులో ఉక్రెయిన్ మంత్రుల నివాసాలు, కార్యాలయాలు ఉన్నాయి. శత్రుదేశం దాడిలో తొలిసారి ఓ ప్రభుత్వ భవనం దెబ్బతిన్నట్టు ఉక్రెయిన్ ప్రధాని యూలియా స్విరిడెన్కో తెలిపారు. "భవనాన్ని పునర్నిర్మించుకోవచ్చు.. కానీ, ప్రాణాలను తిరిగి తీసుకురాలేం కదా" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. రాజకీయ సంకల్పంతో క్రెమ్లిన్ దుశ్చర్యలను అడ్డుకోవచ్చన్నారు. మరోవైపు.. కీవ్ సైతం రష్యాకు చెందిన ద్రుజ్బా చమురు పైప్‌లైన్‌పై ప్రతీకార దాడులు చేపట్టింది.

# అమెరికాలో ఉక్రెయిన్ మహిళ హత్య



రష్యా-ఉక్రెయిన్ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో యుద్ధభూమిలో ఉండలేక ప్రశాంతమైన జీవితం కోసం అమెరికాకు శరణార్థిగా వచ్చిన ఉక్రెయిన్ మహిళ దారుణ హత్యకు గురైంది. హత్యకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మృతురాలిని ఉక్రెయిన్‌కు చెందిన ఇరినా జరుత్స్కాను (23)గా గుర్తించారు. ఆగస్టు 22న నార్త్ కరోలినాలోని షార్లెట్‌లో ఈ ఘటన జరిగింది. రైల్లో ప్రయాణిస్తున్న సమయంలో.. ఆమె వెనుక కూర్చున్న నిందితుడు డెకార్లోస్ బ్రౌన్ జూనియర్ కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం నిందితుడు తర్వాతి స్టాప్‌లో దిగిపోయాడు. ఈ ఘటనతో రైలులోని ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని.. అతడికి నేరచరిత్ర ఉన్నట్టు వివరించారు.

# రాజీనామా ప్రకటించిన జపాన్ ప్రధాని

***పార్టీ అంతర్గత విభేదాలకు స్వస్తి పలికే యోచన***



జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. గతేడాది ఫుమియో కిషిద రాజీనామా తర్వాత అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన షిగెరు ఇషిబా.. అక్టోబర్‌లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, జులైలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్ ఎగువ సభలో అధికార సంకీర్ణ ప్రభుత్వం మెజార్టీని సాధించలేకపోయింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికల నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సెప్టెంబర్ 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా.. ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీకి ప్రత్యామ్నాయ నేతను ఎన్నుకునేందుకుగాను ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను మొదలు పెడుతున్నట్టు చెప్పారు.

# ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్‌లో మెరిసిన భారత్

## పురుషుల ఈవెంట్లో స్వర్ణం - మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో రజతం




ప్రతిష్టాత్మక ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్‌లో భారత ఆర్చర్లు అదరగొట్టి రెండు పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల ఈవెంట్లో స్వర్ణం దక్కించుకోగా.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో రజతం సాధించారు. పురుషుల టీమ్ ఈవెంట్లో రిషబ్, ప్రథమేశ్, అమనై సైని బృందం ఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. తెలుగు తేజం జ్యోతి - రిషబ్ జోడీ తుది పోరులో రెండు పాయింట్లతో స్వర్ణాన్ని కోల్పోయింది.

**ఫ్రాన్సును ఓడించి..**

రిషభ్ యాదవ్, అమన్ సైని, ప్రథమేశ్‌తో కూడిన భారత బృందం ఫైనల్లోనూ విజృంభించింది. ఫ్రాన్స్‌పై రెండు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఫైనల్లో 235-233తో ఫ్రాన్సు చిత్తు చేసిన టీమ్ ఇండియా స్వర్ణాన్ని దక్కించుకుంది. జ్యోతితో కలిసి రజతం సొంతం చేసుకున్న రిషబ్.. పురుషుల టీమ్ ఈవెంట్లో మాత్రం ఏమాత్రం తడబాటుకు గురికాలేదు. మిగతా ఇద్దరితో కలిసి భారత్‌కు గోల్డ్ అందించాడు.

**రెండు పాయింట్ల తేడాతో..**

ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో వెన్నం జ్యోతి సురేఖ జోడీకి రజతం దక్కింది. ఫైనల్లో నెదర్లాండ్స్ ద్వయం చేతిలో 157-155 తేడాతో జ్యోతి-రిషబ్ జోడీ ఓటమి పాలైంది. హెూరాహెూరీగా సాగిన పోరులో కేవలం రెండు పాయింట్ల తేడాతో స్వర్ణం చేజారింది. ప్రపంచ చాంపియన్ షిప్ లో అత్యధిక పతకాలు గెలిచిన భారత ఆర్చర్‌గా ఇప్పటికే రికార్డు సాధించిన జ్యోతి సురేఖకు ఇది తొమ్మిదో పతకం. వ్యక్తిగత విభాగంలో ఒక రజతం,




రెండు కాంస్యాలు నెగ్గిన ఆమె ఖాతాలో నాలుగు టీమ్ పతకాలు (ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యం), రెండు కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ రజతాలు ఉన్నాయి.




**ఖాతాలో రూ.20 వేల కోట్ల నిధులు..**

## అత్యంత సంపన్న బోర్డు బీసీసీఐ

ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డు బీసీసీఐ. అయితే అది ఎంత ధనవంతమైన బోర్డో తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. బీసీసీఐ ఖాతాలో రూ.20 వేల కోట్లకుపైగా నిధులు ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా గత ఐదేళ్లలో బోర్డు సంపద దాదాపు మూడు రెట్లు పెరిగినట్లు సమాచారం. అత్యంత విజయవంతమైన ఐపీఎల్ తో బోర్డుకు భారీగా ఆదాయం వస్తోంది. అలాగే ఐసీసీ నుంచి అందే వాటాతోపాటు అంతర్జాతీయ, దేశవాళీ మ్యాచుల మీడియా హక్కుల నుంచి కూడా ఆదాయం అందుతోంది. బీసీసీఐ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,623 కోట్ల మిగులు నమోదు చేసింది. ఇది అంతకుముందు ఏడాది రూ.1,167 కోట్లుగా ఉండేది.

సెప్టెంబర్ 28న బీసీసీఐ ఏజీఎం జరగనుంది. ఈ క్రమంలో 2024 అకౌంట్‌కు సంబంధించిన స్టేట్మెంట్ వివరాలు బయటకొచ్చాయి. క్రీడా వర్గాల సమాచారం మేరకు.. బీసీసీఐ వద్ద 2019 నాటికి రూ.6 వేల కోట్లు మాత్రమే ఉండేవి. అయితే, గత ఐదేళ్లలో అదనంగా రూ.14,627 కోట్ల సంపదను సృష్టించింది. దీంతో మొత్తం రూ.20,686 కోట్లకు చేరింది. మరే ఇతర క్రికెట్ బోర్డు వద్ద కూడా ఇంత మొత్తం ఉండే అవకాశం లేదు. బీసీసీఐ సభ్యులకు కార్యదర్శి సమర్పించిన వివరాల ప్రకారం.. 2019లో రాష్ట్ర సంఘాలకు చెల్లించాల్సిన వాటితో కలిపి బ్యాంక్ బ్యాలెన్స్ అండ్ క్యాష్ రూ.6,059 కోట్లు ఉండేది. ఇప్పుడు ఆయా సంఘాలకు చెల్లించినది పోగా మిగులు రూ.20,686 కోట్లకు చేరింది. గత ఐదేళ్లలో రూ.14,627 కోట్ల సంపద అదనంగా వచ్చి చేరింది. ఒక్క గతేడాదే రూ.4,193 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐ రూ.1,200 కోట్లను మైదానాల్లో మౌలిక సదుపాయాల కోసం కేటాయించింది. ప్లాటినమ్ జూబ్లీ ఫండ్‌గా రూ.350 కోట్లు, క్రికెట్ అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కేటాయించింది. రాష్ట్ర క్రికెట్ సంఘాలు రూ.1,990 కోట్లు అందుకొన్నాయని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ వివరాలకు అధికారికంగా 28న జరిగే ఏజీఎంలో ఆమోదం తెలపడమే తరువాయి.

# యూఎస్ ఓపెన్ క్వీన్ సబలెంక

అత్యంత ఆసక్తికరంగా సాగిన యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో బెలారస్ క్రీడాకారిణి అర్యానా సబలెంక టైటిల్ సాధించింది. అమెరికాకు చెందిన అమండా అనిసిమోవాపై 6-3, 7-6 (3)తో వరుస సెట్లలో విజయాలు సాధించిన సబలెంక విజేతగా నిలిచింది. వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన 27 ఏళ్ల సబలెంక తాజా యూఎస్ ఓపెన్ టోర్నీ మొత్తం మీద ఒక్క సెట్‌ను మాత్రమే చేజార్చుకోవటం విశేషం.

తాజా విజయంతో సబలెంక రికార్డ్ ప్రైజ్‌మనీని దక్కించుకుంది. యూఎస్ ఓపెన్ పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు సమానంగా ఐదు మిలియన్ డాలర్ల చొప్పున టోర్నీ నిర్వాహకులు ప్రకటించిన విషయం తెలిసిందే. అంటే ఈ విజయం ద్వారా సబలెంకకు రూ.44.08 కోట్ల ప్రైజ్‌మనీ



దక్కింది. ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి పాలై రన్నరప్‌గా నిలిచిన అనిసిమోవా 22.04 కోట్ల రూపాయల అందుకోనుంది. వరుసగా రెండో గ్రాండ్ స్లామ్ ఫైనల్‌లో కూడా ఓటమి చవిచూడడంతో అనిసిమోవా కోర్టులోనే కన్నీటిపర్యంతమైంది.

సబలెంకకు ఇది నాలుగో గ్రాండ్ స్లామ్ టైటిల్. సబలెంక 2023, 2024లో వరుసగా ఆస్ట్రేలియా ఓపెన్ టైటిళ్లు సాధించి.. 2024, 2025లో వరుసగా యూఎస్ ఓపెన్ టైటిళ్లు గెలిచింది. వరుసగా రెండు యూఎస్ ఓపెన్ టైటిళ్లు సాధించడంతో సబలెంక సెరీనా విలియమ్స్ సరసన చేరింది. సెరీనా కూడా గతంలో వరుసగా రెండు ఎడిషన్లలో యూఎస్ ఓపెన్ విజేతగా నిలిచింది.

టైటిల్ గెలిచిన అనంతరం సబలెంక మాట్లాడుతూ.. ఇది నా జీవితంలో మరచిపోలేని క్షణం. నా దేశానికి, అభిమానులకు ఈ విజయం అంకితమని తెలిపింది.

తాజా విజయంతో సబలెంక 100 గ్రాండ్ స్లామ్ మ్యాచ్‌లు గెలిచిన రెండో మహిళగానూ గుర్తింపు పొందింది. సబలెంక ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ లోనూ ఫైనల్‌కు చేరి కోకో గాఫ్ చేతిలో పరాజయంపాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

# దులీప్ ట్రోఫీ ఫైనల్స్‌కు సౌత్, సెంట్రల్ జోన్లు

దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సౌత్ జోన్, సెంట్రల్ జోన్ చేరాయి. సెప్టెంబర్ 11 నుంచి 15వ తేదీ వరకూ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్టేడియంలో తుది పోరు జరగనుంది. రెండు సెమీస్ మ్యాచ్‌లూ డ్రాగా ముగియడం గమనార్హం. తొలి సెమీస్‌లో సౌత్ జోన్‌కు, రెండో సెమీస్‌లో సెంట్రల్ జోన్‌కు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాలు రావడంతో ఫైనల్‌కు చేరాయి.

దులీప్ ట్రోఫీ-2025లో భాగంగా బెంగళూరు వేదికగా నార్త్ జోన్, సౌత్ జోన్ మధ్య జరిగిన తొలి సెమీఫైనల్ డ్రా ముగిసింది. అయితే తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్ జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. సౌత్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్ లో 536 పరుగుల భారీ స్కోర్ సాధించింది. సౌత్ జోన్ బ్యాటర్లలో నారాయణ్ జగదీశన్ అద్భుతమైన సెంచరీతో మెరిశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జగదీశన్ తృటిలో డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. మొత్తంగా 352 బంతులు ఎదుర్కొన్న జగదీశన్.. 16 ఫోర్లు, 2 సిక్సులతో 197 పరుగులు చేశాడు. జగదీశన్ తో పాటు దేవదత్ పడిక్కల్ (57), రికీ భుయ్(54), తన్మయ్ అగర్వాల్ (43) రాణించారు. నార్త్ జోన్ బౌలర్లలో నిశాంత్ సింధు 5, అనుశ్ కంబోజ్ రెండు వికెట్లు వికెట్ తీశారు. అనంతరం నార్త్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్ లో 361 పరుగులకు ఆలౌటైంది. 258/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో చివరి రోజు ఆదివారం ఆటను ఆరంభించిన నార్త్ జోన్.. అదనంగా 103 పరుగులు చేసి ఆలవుట్ అయింది. నార్త్ జోన్ బ్యాటర్లలో శుభమ్ కజురియా(128) సెంచరీతో కదం తొక్కాడు. అతడితో పాటు నిశాంత్ సింధు 82 పరుగులతో రాణించాడు. సౌత్ జోన్ పేసర్ గుర్‌ప్నత్ సింగ్ (4/96) టాపార్డర్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. అతడితో పాటు నిదేశ్ మూడు, టి త్యాగరాజన్, కౌశిక్ తలా వికెట్ సాధించారు.

దీంతో తొలి ఇన్నింగ్స్ లో సౌత్ జోన్‌కు 175 పరుగుల ఆధిక్యం లభించింది. ఆ తర్వాత సెకెండ్ ఇన్నింగ్సును మొదలు పెట్టిన సౌత్ జోన్ వికెట్ నష్టానికి 95 పరుగులు చేసింది. ఈ సమయంలో ఇరు జట్ల కెప్టెన్లు డ్రా కు అంగీకరించడంతో ఆట నిర్ణీత సమయం కంటే ముందుగానే ఆట ముగించారు.

**సమష్టిగా రాణించిన సెంట్రల్ జోన్**


మరో సెమీ ఫైనల్ మ్యాచ్‌లోనూ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెంట్రల్ జోన్ ఫైనల్ చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్ట్ జోన్.. రుతురాజ్ గైక్వాడ్ (184) భారీ సెంచరీతో కదంతొక్కడంతో 438 పరుగులు చేసింది. తనుశ్ కోటియన్ (76), కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ (64) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆ తరువాత తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క ఆటగాడు కూడా సెంచరీ చేయకపోయినా సెంట్రల్ జోన్ 600 పరుగుల భారీ స్కోర్ చేసింది. డానిష్ మాలేవార్ (76), శుభమ్ శర్మ (96), కెప్టెన్ రజత్ పాటిదార్ (77), ఉపేంద్ర యాదవ్ (87), హర్ష్ దూబే (75), సారాంశ్ జైన్ (63 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించారు. సెంట్రల్ జోన్‌కు 162 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వెస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల కష్టానికి 216 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

## తొలి సినిమాకే
# ప్రతిష్ఠాత్మక అవార్డు



వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అనుపర్ణ రాయ్ రికార్డు సృష్టించారు. ఒరిజోంటి కేటగిరీలో అవార్డు అందుకున్న తొలి భారతీయ డైరెక్టర్‌గా నిలిచారు. 'సాంగ్స్ ఆఫ్ ఫర్గాటెన్ ట్రీస్' చిత్రానికిగానూ అనుపర్ణకు పురస్కారం దక్కింది. తొలి సినిమాకే ప్రతిష్ఠాత్మక అవార్డు పొందడం విశేషం. ఒరిజోంటి సెక్షన్‌కు భారత్‌నుంచి ఎంట్రీ పొందిన ఏకైక సినిమా కావడం గమనార్హం. 1949 నుంచి 'గోల్డెన్ లయన్' పేరిట విజేతలకు పురస్కారాల్ని అందిస్తున్నారు. కొత్త ప్రతిభను, ఇండిపెండెంట్ చిత్రాలను ప్రోత్సహించేందుకు దానికి సమానమైన ఒరిజోంటి అవార్డును 20 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టారు. ఆగస్టు 27న మొదలై సెప్టెంబరు 6న ముగిసిన ఈ ఫెస్టివల్లో హాలీవుడ్ మూవీ 'ఫాదర్ మదర్ సిస్టర్ మదర్' ఉత్తమ చిత్రంగా గోల్డెన్ లయన్ అవార్డు దక్కించుకుంది. భారతీయ మహిళలందరికీ అవార్డును అంకితమిస్తున్నట్టు అనుపర్ణ పేర్కొన్నారు. ఇలాంటి కథలు మరిన్ని తెరకెక్కించేందుకు ఈ విజయం స్ఫూర్తినిస్తుందన్నారు. పాలస్తీనాలోని దారుణ పరిస్థితులపై ఆమె స్పందించారు. శాంతి, స్వేచ్ఛకు చిన్నారులంతా అర్హులని, దానికి పాలస్తీనా చిన్నారులు మినహాయింపు కాదని అభిప్రాయపడ్డారు. షార్ట్‌ఫిల్మ్ 'రన్ టు ది రివర్ 2023'లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించారు అనుపర్ణ. పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఆ లఘు చిత్రానికి ప్రశంసలు దక్కాయి. ముంబయిలో ఉద్యోగం చేస్తూనే 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' రూపొందించారు. ముంబయికి వలస వెళ్లిన ఇద్దరు మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారన్న అంశంతో తెరకెక్కిన చిత్రమిది.

# ఇంకేదో ప్లాన్ చేస్తున్న జక్కన్న



ఇండియన్ సినిమా దగ్గర చాలానే భారీ ప్రాజెక్ట్‌లు ఉన్నప్పటికీ వాటిలో పాన్ వరల్డ్ లెవెల్ ప్రాజెక్ట్‌లు కొన్ని ఉన్నాయి. ఆ చిత్రాల్లో మహేష్‌బాబు, ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో రానున్న భారీ చిత్రం ఒకటి. ఇటీవల కెన్యా షెడ్యూల్‌కి సంబంధించి ఇంట్రెస్టింగ్ డీటెయిల్స్ బయటకి వచ్చాయి. ఇక ఈ ఏడాది నవంబర్‌నూ ట్రీట్‌ని మేకర్స్ కన్ఫర్మ్ చేసారు. నవంబర్‌లో ఫస్ట్ లుక్ రివీల్ చేస్తారని తెలిసిందే. కానీ దానితో పాటుగా అంతకు మించి ట్రీట్‌గా సినిమా తాలూకా ఫస్ట్ గ్లింప్స్‌ని అలాగే రిలీజ్ డేట్ ప్రకటన కూడా అందులోనే ఉంటుందని టాక్ వచ్చింది. మరి దీని కోసం రాజమౌళి ఇదివరకు ఎన్నడూ ఏ సినిమాకీ చేయని రీతిలో ప్లానింగ్‌ని అనౌన్స్‌మెంట్ కోసం చేస్తున్నట్టుగా తెలుస్తుంది. దీనితో వరల్డ్ వైడ్ సినిమా దగ్గర ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా మాట్లాడుకునే ఛాన్స్ ఉందట. సో మొత్తానికి నవంబర్‌లో ప్రపంచమే షేకయ్యేలా ఉందని చెప్పాలేమో.

# యూఎస్‌లో ఓజీ ర్యాంపేజ్



పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన చిత్రమే "ఓజి". భారీ హైప్ సెట్ చేసుకున్న సినిమా రిలీజ్ కోసం ఫ్యాన్స్, సినీ లవర్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. యూఎస్ మార్కెట్‌లో అయితే సెన్సేషన్ క్రియేట్ చేసింది. నార్త్ అమెరికాలో 1 మిలియన్ డాలర్స్ మార్క్ గ్రాస్‌ని దాటేసిన ఓజి.. ఇపుడు మరో సాలిడ్ ఫీట్‌ని అందుకున్నట్టు తెలుస్తుంది. దీనితో ఓజికి ఒక్క నార్త్ అమెరికా గడ్డపైనే 40 వేలకి పైగా టికెట్స్ అమ్ముడుపోయినట్టు డిస్ట్రిబ్యూటర్స్ చెబుతున్నారు. ఓజి ర్యాంపేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోచ్చు. ఈ సినిమాకి థమన్ సంగీతం సమకూరిస్తే.. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. అలాగే సెప్టెంబర్ 25న సినిమా విడుదల కానుంది.

## బ్లో అప్
కల్యాణీ ప్రియదర్శన్



# కల్పితం నుంచి కల్పితానికి..



టాలీవుడ్‌నుంచి పాన్ ఇండియా సినిమాలు వరుసపెట్టి వచ్చేస్తున్నాయి. అబ్బురపరిచే విజన్‌తో ప్రేక్షకుల్ని అలరిస్తూ విజయాల్ని అందుకుంటున్నారు. 'మిరాయ్'తో యువ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని అదే ప్రయత్నం చేస్తున్నారు. తేజ సజ్జా హీరోగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రూపొందిన చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని 'మిరాయ్' కథ ఎలా పుట్టిందో మీడియాకు వెల్లడించాడు. "అశోక చక్రవర్తి దగ్గర తొమ్మిది దైవ గ్రంథాలు ఉండేవనే కల్పిత పురాణం ప్రాచుర్యంలో ఉంది. మానవాళికి ఎలాంటి సమస్య ఎదురైనా ఆ గ్రంథాలతో పరిష్కారం లభిస్తుందని, వాటిని సొంతం చేసుకోవడానికి హిట్లర్ సైతం ప్రయత్నించాడనే ప్రచారముంది. అలాంటి విలువైన జ్ఞాన గ్రంథాలు దుష్ట ఆలోచనలున్న మనిషి చేతిలోకి వెళ్తే..? భారత ఇతిహాసాల సాయంతో అలాంటి వ్యక్తిని ఆపగలమా? వాస్తవానికి ఇదే కథాంశం. పూర్తిగా కల్పిత కథ. వర్తమానంలో జరిగే కథ త్రేతాయుగంతో ఎలా ముడిపడిందన్న అంశాన్ని తెరపైనే చూడాలి. అశోకుడు, శ్రీరాముడిని ఎలా కలిపాం? ఆ తొమ్మిది దైవగ్రంథాలు అశోకుడి దగ్గరకు ఎలా వచ్చి ఉండొచ్చు? తదితర విషయాలు ఇందులో ఆసక్తికరం. ఆరేళ్ల క్రితం మొదలైన ఆలోచనను ఇతిహాసాలతో ముడిపెట్టి స్క్రిప్ట్ రాయడానికి సమయం పట్టింది. ఇలా తీస్తానని అనుకోలేదు కానీ, విజువల్‌గా వండర్స్‌నే ఊహించుకుంటూ వచ్చా. కాస్త ఎక్కువ టైం తీసుకుని ఈస్థాయిలో తెరపైకి తెచ్చాను' అంటున్నాడు కార్తీక్ ఘట్టమనేని.

# రీల్ హీరో.. రియల్ హీరో

టాలీవుడ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ ప్రస్తుతం తన కొత్తచిత్రం 'కిష్కింధపురి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రాన్ని కౌశిక్ పెగళ్లపాటి డైరెక్ట్ చేయగా పూర్తి హార్రర్ జోనర్‌గా సినిమాను రూపొందించారు. అయితే, తాను కేవలం రీల్ హీరో మాత్రమే కాదని.. రియల్ హీరో అని నిరూపించుకున్నాడు బెల్లంకొండ శ్రీనివాస్. తాజాగా సోషల్ మీడియాలో ఓ అభిమాని తాను అనారోగ్య కారణాలవల్ల చాలా ఇబ్బందుల్లో ఉన్నానని పేర్కొనగా.. దీనికి బెల్లంకొండ శ్రీనివాస్ స్పందించాడు. తాను చిత్ర ప్రమోషన్స్ కోసం విజయవాడ వస్తున్నానని.. అక్కడ ఆ అభిమానిని కలుసుకుని తనకు వీలైనంత సాయం అందిస్తానని బెల్లంకొండ శ్రీనివాస్ అన్నారు. దీంతో నెట్టింట బెల్లంకొండ శ్రీనివాస్‌ను అభిమానులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఇక కిష్కింధపురి చిత్రంలో అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది.



# కోలీవుడ్ బెస్ట్ యాక్ట్రెస్ సాయిపల్లవి



'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025' (సైమా 2025) ప్రదానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. దుబాయ్‌లో నిర్వహించిన వేడుకలో దక్షిణాది చలన చిత్ర పరిశ్రమల ప్రముఖులు హాజరై సందడి చేశారు. శనివారం రాత్రి తమిళం, మలయాళం ఇండస్ట్రీలకు పురస్కారాలు ఇచ్చారు. కోలీవుడ్‌నుంచి ఉత్తమ చిత్రంగా అమరన్', అదే చిత్రానికిగానూ ఉత్తమనటిగా సాయిపల్లవికి పురస్కారం దక్కింది. మలయాళం నుంచి ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయ్స్', ఉత్తమ నటుడిగా 'పృథ్వీరాజ్ సుకుమారన్' (ది గోట్ లైఫ్)కు అవార్డులు వరించాయి. ఈ 13వ ఎడిషన్ సైమా వేడుకల్లో తెలుగునుంచి 'పుష్ప 2', 'కల్కి' అత్యధిక అవార్డులు దక్కించుకున్న సంగతి తెలిసిందే. చిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం సేవలు అందిస్తున్న శివకుమార్, త్రిషలకు ప్రత్యేక పురస్కారాలు అందచేశారు.